నీటి గండం

పడిపోతున్న భూగర్భ జల మట్టాలు

నీటి నిల్వలు లేక తుప్పలతో పేరుకుపోయిన కొత్తపాలెం పెద్ద చెరువు



- సంరక్షణ తగ్గింది... వినియోగం పెరిగింది
- నగరంలో చెరువులు మాయం
- రోడ్డుకు ఇరువైపులా కాంక్రీట్
- వర్షపు నీరు ఇంకే పరిస్థితే లేదు
- తీర ప్రాంతంలో ఉప్పునీరు
- విశాఖ జిల్లాలో ఐదేళ్ల క్రితంతో పోల్చితే 0.92 మీటర్లు తగ్గిన భూగర్భ జలాలు
- ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి చేయాలని నిపుణుల సూచన
- అప్రమత్తం కాకుంటే 2030కల్లా తాగునీటికి మరింత కటకట

నేడు ప్రపంచ జల దినోత్సవం

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):

మనిషి మనుగడకు నీరే ఆధారం. నీరుండే చోటనే నాగరికత పుట్టింది. అంతటి ప్రాముఖ్యత కలిగిన నీటి సంరక్షణలో మనం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాం. ప్రస్తుతం ఉపరితలంలో నీరే కాదు. భూగర్భంలో నీటిని కూడా విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నాం. కానీ సంరక్షణ మాత్రం వదిలేశాం. అందుకే మార్చి మూడో వారంలోనే విశాఖ నగరంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవం. ఈ ఏడాది నినాదం 'హిమనీనదాలు పరిరక్షణ'. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భూగర్భ జలాలపై కథనం ఇది...

నగరంలోని ఎండాడ, రుషికొండ, మధురవాడ, పెదగంట్యాడ తదితర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. తీర ప్రాంతాల్లో పరిమితికి మించి బోర్లు తవ్వకం, వినియోగం వల్ల సముద్ర జలాలు చొచ్చుకురావడంతో భీమిలి నుంచి పాయకరావుపేట వరకూ పలుచోట్ల ఉప్పునీరు వస్తోంది. భూగర్భ జలాలను సంరక్షించుకోకపోతే భవిష్యత్తులో తీర ప్రాంతానికి 20 కి.మీ. వరకూ ఉప్పునీరు ప్రవేశించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వర్షం తీరులో మార్పులు

నైరుతి రుతుపవనాల సీజన్ 120 రోజుల్లో గతంలో 75 నుంచి 80 రోజులు వర్షాలు కురిసేవి. వర్షం నీరు భూమిలో ఇంకిపోయేది. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. చెరువులు, గెడ్డలు, బావుల్లో నీటి నిల్వలు నిండుగా కనిపించేవి. గత కొన్నాళ్లుగా పూర్తిగా వర్షాల తీరు మారిపోయింది. వర్షం కురిసే రోజుల సంఖ్య 70 కంటే తక్కువకు పడిపోయింది. ఒకేసారి భారీవర్షాలు కురవడంతో నీరు ఇంకే పరిస్థితి లేకుండాపోయింది. భూమిలో తేమ తగ్గిపోయింది. ఏటా 1200 మి.మీ. వర్షపాతం నమోదయ్యే విశాఖలో నీటి కోసం కటకటలాడాల్సి పరిస్థితి వచ్చేసింది.

చెరువులు మాయం

ఒకప్పుడు అల్లిపురం, ప్రస్తుతం ఆర్టీసీ కాంప్లెక్స్, జీవీఎంసీ కార్యాలయం ఉండే ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెరువులు ఉండేవి. అలాగే ముడసర్లోవ రిజర్వాయర్ నుంచి సముద్రంలో కలిసే ... మిగతా 6వ పేజీలో

సెంట్రల్ పార్కు వద్ద 15.88 మీటర్ల లోతులో భూగర్భ జలాలు

విశాఖ జిల్లాలో సుమారు 30 లక్షల మంది జనాభా ఉండగా, 25 లక్షల వరకు నగరంలోనే ఉంటున్నారు. ఐక్యరాజ్యసమితి లెక్కల మేరకు ప్రతి మనిషికి రోజుకు (తాగడం, స్నానం, మరుగుదొడ్డి, బట్టలు ఉతుక్కోవడం, ఇతరత్రా వినియోగం) 150 లీటర్లు నీరు అవసరం. అయితే అంత నీరు ఉపరితలం నుంచి లభించడం లేదు కాబట్టి భూగర్భ జలాలపై ఆధారపడుతున్నాం. ఈ విధంగా నగరంలో రోజు లక్ష ల గ్యాలన్ల నీరు తోడేస్తున్నారు. భూగర్భ జల శాఖ లెక్కల ప్రకారం జిల్లాలోని 11 మండలాల్లో 31 పీజియో మీటర్లు ఉన్నాయి. అక్కడ గత ఏడాది భూగర్భ జలాలను పరిశీలిస్తే...సగటున 7.55 మీటర్ల లోతులో ఉన్నాయి. 2020లో 6.63 మీటర్ల లోతున ఉన్నాయి. అంటే 2020తో పోల్చితే 2024లో 0.92 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇక 2020 మే నెలలో 7.92 మీటర్లగా ఉండగా 2024 మే నెలలో 10.24 మీటర్ల లోతులో ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో పరిశీలిస్తే... సెంట్రల్ పార్కు (మహారాణిపేట మండలం) వద్ద 15.88 మీటర్లు, కణితి కాలనీలో 12.63, ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద 12.4, మధురవాడలో 11.93, ఎండాడలో 11.54,మారికివలసలో 9.21, శివాజీపాలెంలో 8.48, పెందుర్తిలో 8.26, పెదరుషికొండలో 8.03 మీటర్లలోతున భూగర్భ జలాలు ఉన్నాయి. మిగిలినచోట్ల ఆరు మీటర్లు, అంత కంటే తక్కువలోతున నీటి మట్టాలు నమోదయ్యాయి. గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలు కొంతవరకు నగరం, పరిసరాల్లో భూగర్భ జల మట్టాలు మరింతగా పడిపోకుండా కాపాడాయి. అయితే జనవరి నుంచి వర్షాలు లేకపోవడం, వేసవి తీవ్రత పెరగడంతో ఈ ఏడాది మే నాటికి భూగర్భ మట్టాలు మరింతగా పడిపోయే అవకాశం ఉంది. భీమిలి, చిప్పాడ, కోట వీధి, చిలకపేట, జాలారిపేట ప్రాంతాల్లో కొన్నిచోట్ల నీటివాడకం పెరగడంతో ఉప్పు నీరు వస్తోంది. గాజువాక పరిధిలో కణితి కాలనీలో ఫ్లోరైడ్ లక్షణాలు ఉన్నాయి.



నీటి సంరక్షణ గురించి వివరిస్తున్న భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు



అల్లిపురంలోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు

మెడికల్ షాపుల్లో తనిఖీలు

- ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు కలిసి బృందాలుగా ఏర్పడి సోదాలు
- మత్తు ఇంజక్షన్ల విక్రయంపై ఆరా

విశాఖపట్నం/ మహారాణిపేట/ గాజువాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెడికల్ షాపులు, మందులు సరఫరా చేసే ఏజెన్సీలలో 'ఆపరేషన్ గరుడ' పేరుతో శుక్రవారం విస్తృత స్థాయిలో సోదాలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు కలిసి బృందాలుగా విడిపోయి గాజువాక, జ్ఞానాపురం, అల్లిపురం, ఎంవీపీ కాలనీ, అల్లిపురం...ఇలా అనేకచోట్ల తనిఖీలు చేశారు. మందుల పేరుతో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయా? అని పరిశీలించారు. సాధారణంగా అల్ప్రాజోలమ్, ట్రమడోల్ వంటి ఇంజెక్షన్లు మత్తును కలిగిస్తాయి. వీటిని డాక్టర్ చీటీ లేకుండా విక్రయించకూడదు. అలాంటివేమైనా జరుగుతున్నాయా?...అని అధికారులు పరిశీలించారు. అయితే ఎక్కడా అలాంటివి బయటపడినట్టు అధికారులు ప్రకటించలేదు. గాజువాకలో మోహినీ థియేటర్ సమీపాన గల ఎస్ఎస్‌వీ మెడికల్ షాపులో రాత్రి తొమ్మిది గంటల వరకు సోదాలు జరిగాయి. అయితే మార్చి నెలాఖరు, ఆర్థిక సంవత్సరం చివరి రోజులు కావడంతో గడువు ముగిసిన మందులను పక్కనపెట్టి ఏజెన్సీలకు వెనక్కి పంపిస్తారు. అధికారులు వాటిని పట్టుకొని నిర్వాహకులను గద్దించినట్టు సమాచారం. కౌంటర్ సేల్స్, ఇతర అంశాలపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు సమాచారం తీసుకున్నారు. అయితే ఎక్కడా మత్తుమందులు పట్టుకున్నట్టు అధికారులు వెల్లడించలేదు.

'రేషన్ బియ్యం మాఫియా'పై ఆరా

- పౌర సరఫరాల శాఖా మంత్రి దృష్టికి వ్యవహారం
- సమగ్ర దర్యాప్తు చేపట్టాల్సిందిగా ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గాజువాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం మాఫియాపై విజిలెన్స్ అధికారులు దృష్టిసారించారు. 'రేషన్ మాఫియా' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయాన్ని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ... మిగతా 6వ పేజీలో

నెల రోజుల్లో పెండింగ్ టీడీఆర్‌ల జారీ

జిల్లా అధికారులకు పురపాలక శాఖా మంత్రి నారాయణ ఆదేశం

- అమరావతిలో జిల్లా ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్‌లతో సమావేశం
- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెట్రో రైలు ప్రాజెక్టు
- లైట్ మెట్రో, మోడరన్ ఎలక్ట్రిక్ బస్ కారిడార్‌లపై చర్చ
- మాస్టర్ ప్లాన్ మార్పునకు ఎమ్మెల్యేల డిమాండ్



అమరావతిలో జిల్లా ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక శాఖామంత్రి నారాయణ

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నంలో రహదారులు, ఇత్యాది నిర్మాణాల్లో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు ఇవ్వడంలో చాలా జాప్యం జరిగిందని, నెల రోజుల్లో వాటిని క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ హరేంధిర ప్రసాద్‌కు పురపాలక శాఖామంత్రి నారాయణ సూచించారు. ఆయన అమరావతిలో జిల్లా ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లతో సమావేశమై, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తో మాట్లాడారు.

టీడీఆర్‌ల జారీని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే విశాఖలో మెట్రో రైలు, మెట్రో లైట్, మోడరన్ ఎలక్ట్రిక్ బస్ కారిడార్లపై చర్చించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా చేపట్టాల్సి ఉంటుందన్నారు. నిబంధనల మేరకు ముందుకు వెళ్లాలని, ఎక్కడా ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనిపై కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్ సమాధానమిస్తూ టీడీఆర్ బాండ్ల అంశాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉందని, మాస్టర్ ప్లాన్, తాగునీటి సదుపాయం, అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఆక్రమణల తొలగింపులో తగిన జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాల వెల్లువ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ... మిగతా 6వ పేజీలో

ఉగాది తరువాత జీఎం కార్యాలయ పనులు

- డీఆర్ఎం లలిత్ బొహ్రా
- వన్‌టౌన్‌లోని పాత స్టేషన్‌ను వినియోగంలోకి తెచ్చే యత్నం




డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ (జనరల్ మేనేజర్) భవన నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఉగాది తరువాత ఆ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని డీఆర్ఎం లలిత్ బొహ్రా తెలిపారు. దొండపర్తిలోని కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు కొన్ని న్యాయపరమైన అడ్డంకులు వల్ల ఆగాయని, ప్రస్తుతం ఇబ్బంది ఏమీ లేదని, అవి కూడా త్వరలోనే మొదలవుతాయన్నారు. వన్‌టౌన్‌లో ఒక పాత స్టేషన్ ఉందని, దానిని వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని, ఒకటి, రెండు రైళ్లను అక్కడ ఆపే అవకాశం ఉందన్నారు. వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ల ఫ్రీక్వెన్సీ పెంపు, బెంగళూరుకు ఎక్స్‌ప్రెస్ వంటి అంశాలపై విలేకరులు ప్రశ్నించగా, తాను ఇటీవలె విధుల్లో చేరానని, అన్నింటిపై పూర్తి అవగాహన వచ్చాక తగిన చర్యలు చేపడతామన్నారు.

ఉక్కు ఉద్యోగుల మెడపై ఫిట్‌నెస్ కత్తి

నిబంధనలు మారుస్తూ ఉత్తర్వులు జారీ

- అనారోగ్యంతో ఉన్నట్టు తేలితే ఇంటికే...
- 50 దాటితే ఏటా పరీక్షలు
- యాజమాన్యం కొత్త కుట్ర అంటూ కార్మిక వర్గాల ఆందోళన



విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి మరో అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధమైంది. ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణ పేరిట 1,160 మందికి నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. వీరంతా ఈ నెలాఖరుకు వెళ్లిపోతారు. మరోవైపు కాంట్రాక్టు కార్మికులకు గేట్ పాస్‌లు ఇవ్వకుండా వేధిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికుల సంఖ్య తగ్గించాలని కాంట్రాక్టర్లను హెచ్చరిస్తున్నారు.

ఇదిలావుండగా 'ఫిట్‌నెస్' క్లాజ్‌కు మరింత పదునుపెట్టి సవరించిన ఉత్తర్వులు శుక్రవారం జారీచేశారు. ఉద్యోగులకు పీరియాడికల్‌గా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామని, వాటిలో ఏమైనా తేడా వస్తే నిబంధనల ప్రకారం ఉద్యోగం వదిలి వెళ్లిపోవలసి ఉంటుందని హెచ్చరిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వాస్తవానికి ప్లాంటులో జనరల్ సర్వీస్ చేసే ఉద్యోగులకు ఐదేళ్లకు ఓసారి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తారు. అదే షిఫ్టుల్లో పనిచేసే వారికైతే రెండేళ్లకు ఓసారి చేస్తారు. ఎవరికి ఎటువంటి అనారోగ్యం ఉన్నా స్టీల్ ప్లాంటు జనరల్ ఆస్పత్రికే వెళతారు. పెద్ద అనారోగ్యం అయితే అక్కడి నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేయించుకుంటారు. ఉద్యోగుల మెడికల్ రిపోర్టు అంతా ఆస్పత్రి నుంచి యాజమాన్యానికి ఎప్పటికప్పుడు అందుతుంది. కాబట్టి యాజమాన్యాన్ని మోసగించి అనారోగ్యంతో విధులు నిర్వహించే ఉద్యోగులు ఎవరూ ఉండరు. కానీ యాజమాన్యం 'ఫిట్‌నెస్' పేరుతో యాభై ఏళ్లు దాటిన వారిని బయటకు పంపించేయాలనే ఆలోచనతో కొత్త ఉత్తర్వులు జారీ చేసిందని కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగులలో ఎవరికైనా తాత్కాలికంగా నడుము నొప్పి, తదితర సాధారణ సమస్య ఉంటే...అటువంటి వారిని ఆఫీసుకు పరిమితం ... మిగతా 6వ పేజీలో

5న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు



ద్వారకా బస్‌స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వచ్చే నెల ఆరో తేదీన సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో ఐదో తేదీ ఉదయం 6.00 గంటల నుంచి బస్సులు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రెండు గంటలకు ఒక ప్రత్యేక బస్సు ఆపరేట్ చేయాలని ప్రణాళిక తయారు చేశామని, ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా అవసరమైనన్ని ఆపరేట్ చేస్తామని ఆయన వెల్లడించారు. విశాఖ నుంచి సూపర్ లగ్జరీ సర్వీస్‌లో సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లేందుకు రూ.600, రాజమండ్రి మీదుగా భద్రాచలం వెళ్లేందుకు రూ.700 చార్జీగా నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు. ఆర్టీసీ వెబ్‌సైట్, రిజర్వేషన్ కౌంటర్, అథరైజ్డు ఏజెన్సీల నుంచి సీట్లు రిజర్వు చేసుకోవచ్చునని ఆర్ఎం తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.11 (శనివారం సాయంత్రం)

సహర్ : 4.42 (ఆదివారం ఉదయం)

విశాఖ చేరుకున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్



విశాఖ విమానాశ్రయంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్‌పంత్, ఇతర జట్టు ఆటగాళ్లు

24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్

విశాఖపట్నం-స్పోర్ట్సు/గోపాలపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు శుక్రవారం నగరానికి చేరుకుంది. రాత్రి 7.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు అక్కడ నుంచి ప్రత్యేక బస్సులలో హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌తోపాటు డేవిడ్ మిల్లర్, మార్‌క్రమ్, హిమ్మత్ సింగ్, మాథ్యూ బ్రీజ్‌టిక్, నికోలస్ పూరన్, ఆర్యన్ జుయల్, మిచెల్ మార్ష్, అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, యువరాజ్ చౌధరి, రాజ్‌వర్ధన్ హంగ్రేకర్, అర్షిన్ కులకర్ణి, ఆయుష్ బదోని, అవేశ్ ఖాన్, ఆకాశ్ దీప్, సిద్దార్థ్, దిగ్వేష్ సింగ్, ఆకాశ్ సింగ్, షమర్ జోసెఫ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, మొహిసిన్ ఖాన్, రవి బిష్ణోయ్, మరో 25 మంది సపోర్టింగ్ సిబ్బంది విశాఖ చేరుకున్నారు. శని, ఆదివారాల్లో నెట్ ప్రాక్టీస్ చేసి సోమవారం రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్నారు.



పార్కులో వాటరింగ్ చేయకపోవడంతో ఎండిపోయిన గడ్డి





తుప్పు పట్టి పాడవుతున్న పిల్లల ఆట పరికరాలు

పార్క్ నిర్వహణలో నిర్లక్ష్యం

- అధ్వానంగా పొట్టి శ్రీరాములు పార్కు
- తుప్పు పట్టిన ఆట వస్తువులు
- పేరుకుపోయిన తుప్పలు
- పట్టించుకోని అధికారులు

భీమునిపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్‌లో వున్న పొట్టి శ్రీరాములు పార్క్ నిర్వహణ అధ్వానంగా ఉంది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కు మొత్తం తుప్పలతో నిండిపోయింది. అలాగే పిల్లల ఆట వస్తువులు తుప్పు పట్టి పాడవుతున్నాయి. కొన్నేళ్ల క్రితం జీవీఎంసీ అధికారులు పట్టణవాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు లక్షలాది రూపాయలతో ఈ పార్కును ఏర్పాటు చేశారు. కొన్నేళ్లు నిర్వహణ సక్రమంగానే సాగింది. సుమారు నాలుగున్నరేళ్ల నుంచి నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు. వాస్తవానికి ఈ పార్కును సందర్శకులు ఎక్కువగా వినియోగించే అవకాశం లేదు. పార్కును ఆనుకుని పానీ పూరీ, నూడిల్స్ ఇతర తినుబండారాల దుకాణాలు వున్నాయి. తినుబండారాలు కొనుగోలు చేసిన సందర్శకులు వాటిని తీసుకుని పార్కులోకి వచ్చి అక్కడే పడేస్తుండడంతో జీవీఎంసీ అధికారులు పార్కుకు ఎప్పుడూ తాళాలు వేసేస్తుంటారు. పార్క్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం ఉండడంతో ఆయన జయంతి, వర్ధంతి రోజుల్లో మాత్రం తెరిచి శుభ్రం చేస్తారు. మిగతా రోజుల్లో నిర్వహణను పట్టించుకోరు. దీంతో పార్కు నిర్వహణ అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా పిల్లల సౌకర్యార్థం దివీస్ కంపెనీ పార్కులో ఏర్పాటు చేసిన జారుడు బల్ల, తూగుడు బల్ల, తదితర ఆట వస్తువులు తుప్పు పట్టి పనికిరాకుండాపోతున్నాయి.

ఉన్నతాధికారులు వస్తారని...

పట్టణంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కమిటీ పర్యటిస్తుందని తెలియడంతో అధికారులు హడావుడిగా పార్కు గేటు తీసి లోపల శుభ్రం చేశారు. పార్క్ ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడేది, ప్రస్తుతం ఆ జాడే లేకుండాపోయింది. అధికారులు నిర్లక్ష్యం వల్ల సందర్శకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పార్కు వినియోగానికి నోచుకోకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు. భీమిలి బీచ్‌కు ప్రతిరోజూ ఎంతోమంది సందర్శకులు వస్తుంటారు. ఈనేపథ్యంలో పార్కు నిర్వహణ సక్రమంగా చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేడు నూకాలమ్మ ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

భీమునిపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నూకాలమ్మ ఉత్సవాల నిర్వహణపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి అల్లిపిల్లి వేణుబాబు, యెచ్చర్ల హరి తెలిపారు. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. ఉదయం పదిన్నర గంటలకు బీచ్ రోడ్‌లో వున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికారులు, కమిటీ సభ్యులు సమీక్షలో పాల్గొంటారని చెప్పారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



సింహాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం రాత్రి అమ్మవార్ల తిరువీధి వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సువర్ణ, సింహవల్లీ తాయర్ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పలు పుష్పమాలికలతో అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రాల నడుమ బేడా మండప తిరువీధి జరిపారు. మార్గంలో అష్టదిక్పాలకులకు పూజలు చేసి, నాలాయిర దివ్యప్రబంధం, నాలుగు వేదాలను పండితులు పారాయణలు చేయగా అర్చకులు అమ్మవార్లకు కర్పూర నీరాజనాలిచ్చి, భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు



సింహాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాదనలు యధావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసిషోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి పవిత్ర తులసీ దళాలతో అర్చనలు జరిపారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. స్వామివారికి మంత్రపుష్పం ,కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



వాటర్ ట్యాంక్ ప్రాంతంలో కలుస్తున్న మురుగు నీరు

గోస్తనీలో కలుస్తున్న మురుగు నీరు

తగరపువలస, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస వద్ద ఉన్న గోస్తనీ నదిలో మురుగు కలుస్తుండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కొండపేట తాగునీటి ట్యాంకు వద్ద ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. తగరపువలస, పరిసర ప్రాంతాలకు తాగునీరు పంపింగ్ చేయడానికి కొండపేట వద్ద ట్యాంకు నిర్మించారు. దీనికి సమీపంలోనే మురుగు నీరు నదిలో కలుస్తుండడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పలువురు భయపడుతున్నారు. ఈ ట్యాంకు నుంచి రెగ్యులర్‌గా తాగునీరు పంపింగ్ చేయకపోవడంతో పెద్దగా సమస్య లేదని అధికారులు చెబుతున్నా, అత్యవసర సమయాల్లో పంపింగ్ చేసినప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నీటి గండం

... 5వ పేజీ తరువాయి

వాగు (ప్రస్తుతం ఎంవీపీ కాలనీ మధ్యగుండా వెళుతుంది) వేసవిలో మంచినీటితో ప్రవహించేది. అటువంటి వాగు ఇప్పుడు మురుగు కాల్వగా మారింది. అదేవిధంగా నగరు శివారులో పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకూ గొలుసుకట్టు చెరువులు మాయమయ్యాయి. మధురవాడ, కొమ్మాదిలో గృహ నిర్మాణ సంస్థ కాలనీలు వెలిశాయి. రుషికొండ, పెదగంట్యాడ పరిసరాల్లో చెరువులు కప్పేశారు.

స్మార్ట్ సిటీ పేరుతో రోడ్లుకు ఇరువైపులా కాంక్రీట్...

స్మార్ట్ సిటీ పేరుతో నగరంలో రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేశారు. దీనివల్ల వర్షపునీరు భూమిలో ఇంకే అవకాశం పూర్తిగా మూసుకుపోయింది. చాలా దేశాల్లో రోడ్లకు ఇరువైపులా నీరు ఇంకే కాంక్రీట్‌ను వినియోగిస్తుంటారు. చిన్నచిన్న రంధ్రాలు వుండడంతో నీరు భూమిలోకి ఇంకిపోతుంది. అటువంటి విధానం జీవీఎంసీ పరిధిలో ఎక్కడా కనిపించదు. పార్కుల్లో కూడా సిమెంట్ నిర్మాణాలే పెరిగాయి.

రెయిన్ హార్వెస్ట్ విధానం విఫలం

నగరంలో వర్షపునీరు భూమిలోకి ఇంకే విధానం అమలు పూర్తిగా విఫలమైంది. వ్యక్తిగత గృహం నుంచి అపార్టుమెంట్ వరకూ నిర్మాణ సమయంలో విధిగా ఇంకుడుగుంతలు తవ్వాలి. అయితే పది శాతం మంది కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవడం లేదు. ఇంకుడు గుంతల ఏర్పాటుకు బిల్డర్లు సుముఖత చూపడం లేదు, వ్యక్తిగత ఇల్లు కట్టుకునే వారు కూడా బోరు వేస్తున్నారు తప్ప ఇంకుడు గుంతల ఆలోచన చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు అలంకారప్రాయంగా ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు, మైదానాల్లో కూడా ఇంకుడు గుంతలు నిర్వహించడం లేదు. కనీసం వర్షం పడే నీటిని భూమిలోకి పంపే ఏర్పాట్లు కనిపించవు.

ప్రతి ఇంట్లో వర్షపునీటి నిల్వ చేయాలి

- శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జల శాఖ, అనకాపల్లి జిల్లా (విశాఖ జిల్లా ఇన్‌చార్జి)

నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. భూమిలో నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నాం. కానీ వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేస్తున్నారు. 2030కల్లా నీటికి కటకట వచ్చే పరిస్థితి ఉందని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకు తగినంతగా ప్రజలు సన్నద్ధం కావడం లేదు. ఇంటి నిర్మాణ అనుమతుల్లో తప్పనిసరిగా నీటి నిల్వకు ఏర్పాట్లు చేయాలనే నిబంధన అమలుచేయాలి. నేల స్వభావం, నిర్మాణం విధానం మేరకు వర్షపునీటి నిల్వ ట్యాంకులు నిర్మించాలి. నగరంలో కొండలున్నచోట చెక్‌డ్యామ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు నిర్మించాలి. గ్రామీణ ప్రాంతంలో సాధ్యమైనంతగా ఉపరితలంలో లభించే నీటిని వాడుకోవాలి. చెరువులు, వాగులు, పాడుపడిన బావులను నీటి నిల్వలకు అనుగుణంగా రూపొందించాలి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తీర ప్రాంతాల్లో ప్రజలు 40 మీటర్లకు మించి బోర్లు వేయకూడదు. నీటి ప్రాధాన్యంపై ప్రజలను చైతన్య పరచాలి. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ ప్రాధాన్యం, ఇప్పుడు నగరంలో హెల్మెట్ ధారణపై పోలీసులు అవగాహన కల్పించినట్టు నీటి వినియోగం, నిల్వల సంరక్షణపై పెద్దఎత్తున చైతన్యం రావాల్సిన అవసరం ఉంది.

సాగర్‌నగర్‌లో బాలికకు డయేరియా

సాగర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలిక డయేరియా లక్షణాలతో గీతం ఆసుపత్రిలో శుక్రవారం చేరింది.ఎంబీజీ సి గృహ సముదాయంలో ఉంటున్న ఆ బాలిక కొద్ది రోజులుగా వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతూ తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈమేరకు తల్లిదండ్రులు గీతం ఆసుపత్రిలో చేర్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా వైద్య సిబ్బంది తక్ష ణమే ఆ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసే చర్యలు చేపట్టారు. అక్కడ ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారేమోనని ఆరా తీస్తున్నారు.

నాలుగు గ్రామాలకు ఇన్‌ఛార్జి వీఆర్‌ఓలు

పద్మనాభం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు గ్రామాలకు ఇన్‌ఛార్జి వీఆర్‌ఓలను నియమిస్తూ తహసీల్దారు ఆనందరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలక్ష్యం వహించిన బాందేవుపురం వీఆర్‌ఓను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో ఆ గ్రామానికి పద్మనాభం వీఆర్‌ఓ అప్పలరాజును ఇన్‌ఛార్జిగా నియమించారు. అలాగే బాందేవుపురం రెవెన్యూ క్లస్టర్‌లోని తిమ్మాపురంనకు గంధవరం వీఆర్‌ఓ కనకారావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. నేరేళ్లవలస, చిన్నాపురం వీఆర్‌ఓగా పని చేస్తున్న కృష్ణవేణిని తహసీల్దారు సిఫారసు మేరకు కలెక్టర్ సరెండర్ చేయడంతో నేరేళ్లవలసకు ఇన్‌చార్జి వీఆర్‌ఓగా బీఆర్ తాళ్లవలస వీఆర్‌ఓ ఎస్‌ఏఎస్‌ఎస్‌యూఎం రావును, చిన్నాపురంనకు ఇన్‌ఛార్జిగా తునివలస వీఆర్‌ఓ శ్రీనివాసరావును నియమించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆనందపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్‌వీపాలెం పంచాయతీ నేల్తేరు గ్రామంలో ఉన్న కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఏడో తరగతిలో రెండు, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40, సెకండ్ ఇయర్‌లో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల వారు వచ్చేనెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి పరికరాలు

భీమునిపట్నం (రూరల్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నగరపాలెం గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి దివీస్ యాజమాన్యం రూ. 95 వేలు విలువైన వస్తువులు అందజేసింది.కేంద్రంలో కనీస సదుపాయాలు లేవని సర్పంచ్ తెలియజేయడంతో స్పందించిన దివీస్ యాజమాన్యం రోగుల కోసం రెండు బెడ్‌లు, ఔషధాలు భద్రపరిచేందుకు బీరువా, రోగులు కుర్చునేందుకు మూడు కుర్చీలు వితరణగా ఇచ్చింది. వీటిని ఆరోగ్య కేంద్రం సిబ్బందికి ఆ కంపెనీ సీఎస్ఆర్ మేనేజరు సురేష్‌కుమార్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శశికళ, ఏఎన్ఎం రమణకుమారి, స్థానిక నాయకులు చంద్రశేఖర్, సన్యాసిరావు, సీఎస్ఆర్ ప్రతినిధులు శేఖర్‌బాబు, కనకరాజు పాల్గొన్నారు.

భవితలో డౌన్ సింద్రోమ్ దినోత్సవం

ఆనందపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో డౌన్ సిండ్రోమ్ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహిత విద్యా ఉపాధ్యాయుడు కలమటి శ్రీనివాస్ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ ఉన్న విద్యార్థులను ప్రత్యేక శిక్షణ ద్వారా మానసికంగా నయం చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంజనాకుమారి, ఉపాధ్యాయులు కె. జయలక్ష్మి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మధురవాడ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ డిపోలో బస్సుల సంఖ్య పెరగనుందని, అందుకు అనుగుణంగా సిబ్బందిని కూడా పెంచుతామని చెప్పారు. మధురవాడ పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఇక్కడి నుంచే దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించేలా డిపోను అభివృద్ధి చేస్తామని చెప్పారు. సమావేశంలో మధురవాడ డిపో మేనేజర్ రాజు, అసిస్టెంట్ ఇంజినీర్ మెకానికల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పద్మనాభం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పోషకాహారంతో పాటు పూర్వ ప్రాథమిక విద్య అందించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నూతన పద్ధతులు అవలంబించాలని రీసోర్సు పర్సన్లు చెప్పారు. శుక్రవారం వారు స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ బీ, పడాయి బీ (పోషణ, విద్య) అన్న అంశంపై మాతా శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. పోషకాహార, సూక్ష్మ పోషకాహార లోపాలు గల వారిని గుర్తించి వారికి పోషకాహారం అందించడంతో పాటు తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, ఉమాజానకి, పోషకాహార లోపాల గుర్తింపు నివారణ మార్గాలపై వివరించారు.

అన్నవరంలో అభివృద్ధి పనులు

భీమునిపట్నం (రూరల్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నవరం తీర ప్రాంతంలో మే ఫెయిర్ సంస్థ రిసార్టు నిర్మాణానికి, మౌలిక సదుపాయాల కల్పనకు పర్యాటక శాఖ నిధులు కేటాయించింది. ఈ స్థలం భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఇక్కడ హోటళ్లు, రిసార్టుల నిర్మాణానికి చాలా సంస్థలు ముందుకు వచ్చాయి. ఈమేరకు అన్నవరం సమీపంలో రిసార్టు నిర్మాణం చేపట్ట నున్న సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం 40 ఎకరాలు కేటాయించింది. అయితే ఆ స్థలంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆ సంస్థ ఇంతవరకు ఎటువంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించింది. తాగునీటి సదుపాయానికి రూ.3.03 కోట్లు, విద్యుత్ సౌకర్యానికి రూ.,3.06 కోట్లు, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పించడానికి రూ.4.78 కోట్లు కేటాయించింది. దీంతో మే ఫెయిర్ సంస్థ త్వరలోనే రిసార్టు నిర్మాణం చేపట్టే అవకాశం ఉంది.

అడవులతోనే పర్యావరణ పరిరక్షణ

కొమ్మాది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అడవులతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో జరిగిన అటవీ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భూగోళంలో మూడింట అడవులు ఉన్నాయని, వాటి వల్లే మానవ మనుగడ సాధ్యమన్నారు. విద్యార్థులు చెట్లు నాటడంతో పాటు వాటిని పరిరక్షించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఫ్లకార్డులతో చెట్ల పెంపకం ప్రాముఖ్యతను వివరించారు.

శారదా పీఠం భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

విశాఖ జిల్లా జేసీకి రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆదేశం

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని చినముషిడివాడలో శారదా పీఠం భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. శుక్రవారం అమరావతిలో జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోల శిక్షణ కార్యక్రమం జరిగింది. సమావేశం అనంతరం సిసోడియాను విశాఖ జేసీ కలిశారు. ఈ సందర్భంగా శారదా పీఠం భూ ఆక్రమణల వ్యవహారం చర్చకు వచ్చింది. గురువారం పెందుర్తి తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి సర్వే చేశారని జేసీ వివరించారు. గెడ్డ పోరంబోకు, రహదారి, వీఎంఆర్డీఏ లేఅవుట్‌లో కొంత మేర ఆక్రమించినట్టు తేలిందని చెప్పారు. దీంతో సిసోడియా మాట్లాడుతూ ఆక్రమణలు పూర్తిగా నిర్ధారించిన తరువాత చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



దళితవాడలో నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లు

అధ్వానంగా సామాజిక మరుగుదొడ్లు

తగరపువలస, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పరిధిలోని కొండపేట, సంతపేట, గొల్లపాలెం, దళిత కాలనీల్లో ఉన్న సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేక అధ్వానంగా ఉన్నాయి. చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పే అండ్ యూజ్ పద్ధతిలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ కొంతవరకు పర్వాలేదు కానీ, మిగిలిన వాటి పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. చాలా వాటికి రన్నింగ్ వాటర్ వచ్చే మోటార్లు సరిగ్గా పనిచేయడం లేదు. కొన్నింటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో విపరీతమైన దుర్గంధ వెదజల్లుతున్నాయి. వీటి లోపలికి వెళ్లడానికి కూడా ఎవరూ ఇష్టపడడం లేదు. అధికారులు తక్షణమే స్పందించి మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సింహాచలంలో...



వినియోగంలో లేని సులభ్ కాంప్లెక్స్

సింహాచలం : అప్పన్న స్వామికి ఏటా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా.. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. గత ఏడాది ఆగస్టులో జరిగిన గిరి ప్రదక్షిణ సందర్భంగా కొండదిగువ తొలిపావంచా సమీపంలో వినియోగంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌ను అధికారులు తొలగించి, పక్కన పడేశారు. ఉత్సవం ముగిసి నేటికి సుమారు ఏడు నెలలు కావస్తున్నా.. తిరిగి దాన్ని పునరుద్ధరించలేదు. దీంతో రాత్రి వేళ కొండదిగువన బస చేస్తున్న భక్తులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే సులభ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

'విద్యార్థులు నైతిక విలువలు పాటించాలి'



లక్ష్మీని సన్మానిస్తున్న గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి సోమరాజు

కొమ్మాది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు అలవరుచుకోవాలని పాత్ర ఇండియా బీపీవో సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ ముక్కవల్లి అన్నారు. శుక్రవారం కొమ్మాదిలో గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలుగా మారకూడదని హెచ్చరించారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ ఫౌండర్ ద్వారం వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంగీతం తదితర కళలను అభ్యసించాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి ప్రదర్శనలు అలరించాయి. అలాగే గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, మెంబర్ రాజగణపతి అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, గవర్నింగ్ బాడీ మెంబర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నెల రోజుల్లో పెండింగ్ టీడీఆర్‌ల జారీ

... 5వ పేజీ తరువాయి

వీఎంఆర్‌డీఏ ఖరారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను మార్చాల్సిందేనని జిల్లా ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. విశాఖ నుంచి ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వారి స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్‌ని సంగివలస మీదుగా మళ్లించారని ఆరోపించారు. అవసరమైతే సీఆర్‌జెడ్ నిబంధనలు సవరించి అయినా సరే బీచ్ కారిడార్‌ను, మాస్టర్‌ప్లాన్‌ను సరిచేయాలని మంత్రిని కోరారు. ఈ మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు మంత్రి నారాయణ సూచించారు. రహదారుల విస్తరణకు అవసరమైన మేరకే ప్రజల నుంచి భూమి తీసుకోవాలన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానించే రహదారుల అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలన్నారు. డబుల్ డెక్కర్, మెట్రో కారిడార్ ఆలోచన ఉందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు.భోగాపురం విమానాశ్రయానికి విశాఖ నుంచివెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలు అనేకం ఉన్నాయని, వాటికి పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యేలు కోరారు. అమరావతిపై వారం వారం సమీక్షిస్తున్నట్టుగానే విశాఖ అభివృద్ధిపై వారం వారం సమీక్షించాలని గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా కోరారు. భూముల అన్యాక్రాంతం విషయాల్లో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మోసపోయిన ప్రజలకు అండగా ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు,గణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు పీలా గోవింద్, ప్రణవ్‌గోపాల్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల మెడపై ఫిట్‌నెస్ కత్తి

... 5వ పేజీ తరువాయి

చేసి, ఆ విభాగంలో మిగిలిన ఉద్యోగులు ఆ పనిని షేర్ చేసుకొని పూర్తి చేస్తుంటారు. ఇలాంటివి అన్ని విభాగాల్లోను సాధారణం. ఇప్పుడు ఇలాంటి వారిని గుర్తించి బయటకు పంపాలని నిర్ణయించారనే ప్రచారం జరుగుతోంది. అదొక్కటే కాకుండా నిజాయితీ, పనితీరును కూడా అంచనా వేసి దానిని కూడా ఫిట్‌నెస్ నివేదికలో పొందుపరిచేలా పాత నిబంధనలకు సవరణలు చేశారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

యాభై దాటితే ఏటా పరీక్షలు

యాభై ఏళ్లు దాటిన వారికి ఇకపై ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామని యాజమాన్యం చెబుతోంది. ఇది చట్టంలోనే ఉందని, తాము కొత్తగా పెట్టిన నిబంధన కాదని అధికారులు చెబుతున్నారు. అలాగైతే ఇన్నాళ్లూ ఎందుకు అమలు చేయలేదని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కొన్ని విభాగాల్లో వేయి డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని, అక్కడ పనిచేస్తున్న వారికి కచ్చితంగా అనారోగ్య సమస్యలు వస్తాయని, వారికి న్యాయం చేయాల్సింది పోయి ఫిట్‌నెస్ పేరుతో తొలగిస్తామంటే.. కొత్తగా ఎవరైనా పనిచేయడానికి వస్తారా? అని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ కొత్త ఉత్తర్వులు యాభై ఏళ్లు దాటిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇచ్చారని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని అధికార, కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

'రేషన్ బియ్యం మాఫియా'పై ఆరా

... 5వ పేజీ తరువాయి

స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు విజిలెన్స్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. గాజువాక ప్రాంతంలో రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నది ఎవరు?, ఎక్కడకు తరలిస్తున్నారు?, ఎవరెవరు సహకరిస్తున్నారు?...అనే సమాచారం సేకరించే పనిలో ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు ఇంటర్వ్యూలు

ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదని బోర్డు వెల్లడి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు శుక్రవారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎవరినీ ఎంపిక చేయలేదని తెలిపింది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న గణేష్ త్వరలో పదవీ విరమణ చేయనున్నందున...ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు శుక్రవారం పీఈఎస్‌బీ వర్చువల్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. స్టీల్‌ప్లాంటు నుంచి ఐదుగురు, హెచ్‌బీఎల్, ఎన్టీపీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, ఐవోసీఎల్, బెల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున పది మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అయితే ఎవరినీ ఎంపిక చేయలేదని పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంవీపీ కాలనీలోని జిల్లా వెనుకబడిన తరగుతల సేవా సహకార సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. బీసీ, ఈబీసీలకు సంబంధించిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలకు బ్యాంకు అంగీకారంతో రాయితీతో రుణాలు మంజూరు చేయడానికి దరఖాస్తులను ఏపీ ఏబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సంఘం ఛైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ కోరారు. దరఖాస్తులను ఈ నెల పది నుంచి స్వీకరిస్తుండగా, 22 గడువు తేదీగా స్పష్టం చేశారు. వ్యవసాయం-అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పథకాలు, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ అభ్యర్థులకు చెందిన నిరుద్యోగ బీసీ, ఈడబ్ల్యుఎస్ యువతకు జనరిక్ ఫార్మసీలు, మేదర, కుమ్మరి, శాలివాహన వృత్తుల కుటుంబాలకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటి వరకూ బీసీ కార్పొరేషన్ స్వయం ఉపాధిలో లక్ష్యం 1648 కాగా 4427 మంది, ఈడబ్ల్యుఎస్ కార్పొరేషన్ ఉపాధిలో లక్ష్యం 213 కాగా 241 మంది, కాపు కార్పొరేషన్ చంద్రన్న స్వయం ఉపాధి టార్గెట్ 452 కాగా 184 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు కలెక్టర్ తెలిపారు. గడువు తేదీ 22లోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏయూ వీసీకి సర్దార్ గౌతు లచ్చన్న జీవిత చరిత్ర పుస్తకం బహూకరణ


వీసీ రాజశేఖర్‌కు పుస్తకాన్ని బహూకరిస్తున్న పూడి కిరణ్‌కుమార్

వెంకోజీపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్‌కు సర్దార్ గౌతు లచ్చన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని స్టూడెంట్స్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ బహూకరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌మాట్లాడుతూ ఏయూనుమరింత అభివృద్ధిబాటలో నడిపించాలని వీసీని కోరారు.

వీధి దీపాలకు మరమ్మతు

వెంకోజీపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో మరమ్మతులకు గురైన వీధి దీపాలను ఎలక్ట్రికల్ మాజీ లైన్‌మన్, శ్రీసీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు.

సినిమా గైడ్

- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **రాజుగారి దొంగలు :** శ్రీకన్య-2 (గాజువాక)
- **శబ్దం :** సంగం,శరద, సౌజన్య (గోపాలపట్నం),
- **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం),తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు(నలుపు) 38, బెండకాయలు 38, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24, వెల్లుల్లి(పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 20, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట)3, చుక్కకూర(కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194


ఆదర్శ నగర్ కూడలి వద్ద ప్రధాన కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు


కాలువలో నిలిచిన మురుగు నీరు

కాలువ నిండా వ్యర్థాలే!

- మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్గంధం
- స్థానికుల ఇబ్బందులు

ఆరిలోవ, మార్చి12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 10వ వార్డులో గల ఆదర్శనగర్ ప్రధాన కూడలి సమీపంలోని ప్రధాన కాలువ అంతా వ్యర్థాలతో నిండిపోయి ఉన్నది. దీంతో మురుగు ప్రవహించకపోవడం వల్ల వ్యర్థాలు, చెత్తాచెదారం నిల్వ మాదిరిగా నిలిచిపోయి ఉంది. ఫలితంగా ఈగలు, దోమల వ్యాప్తి చెందుతున్నాయి. తీవ్ర దుర్వాసన కూడా వస్తుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచ రోజూ వందలాది వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతం నుంచి ఆదర్శనగర్, రవంద్రనగర్ తదతర ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేకుల షెడ్లు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెంకోజీపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ శివాలయానికి ఆనుకుని ఉన్న ఆక్రమణ షెడ్డులను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు. 'ప్రభుత్వ స్థలంలో నివాసం' పేరిట'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించినటౌన్‌ప్లానింగ్ అధికారులు వెంటనే షెడ్ల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. గోశాల, షెడ్డుకు కొంత భాగాలను తొలగించి, అక్కడ నివాసముంటున్న వారికి హెచ్చరించారు. వారే స్వయంగా షెడ్డును తొలగించాలని, లేకుంటే పూర్తిగా తొలగిస్తామనిస్పష్టం చేశారు.


పాక్షికంగా తొలగించిన షెడ్లు

పలు అభివృద్ధి పనులకు స్థాయీసంఘం ఆమోదం

- సంఘం ఛైర్‌పర్సన్ హరి వెంకటకుమారి వెల్లడి


సమావేశంలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి, స్థాయీ సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని సంఘం ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు.

శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం స్థాయీ సంఘం సమావేశమందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 104 అంశాలు పొందుపరిచారని, వాటిని సంఘం సభ్యులు చర్చించిన పిదప ఒక అంశం వాయిదా వేయగా, 2 అంశాలు సభ్యులు తిరస్కరించారని, మిగిలి 101 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఉన్నాయన్నారు. వాటిని చర్చించిన పిదప సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. ఈ సమావేశంలో కార్యదర్శి బీవీ రమణ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగెలు

- ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు


త్రిబుల్ ఎస్ బార్ పక్కన ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

మద్దిలపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం జాతీయ రహదారి త్రిబుల్ ఎస్ బార్ పక్కన విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ విద్యుత్ స్థంభంపైనా వైర్లు తెగిపోవడంతో కిందకు వేలాడుతున్నాయి. అంతేకాకుండా విద్యుత్ లైట్ల కోసం ఏర్పాటు చేసిన బోర్డుకు ఎలాంటి రక్షణ ఏర్పాటు చేయలేదు. దీంతో వైర్లు బయటకు వచ్చి భయాందోళన కలిగిస్తున్నాయి. ప్రతి రోజూ మందుబాబులు విద్యుత్ స్తంభం కిందే మద్యం సేవించి మద్యం మత్తులో బాటిల్స్ అక్కడే పగలగొడ్తున్నారు. ఓ పక్క వైర్లు, మరో పక్క ఖాళీ మద్యం సీసాలు, గాజు పెంకులతో పాదచారులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేబుల్ వైర్ల చోరీ కేసులో 8 మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ద్వారకా నేర విభాగం సీఐ చక్రధర్

ఎంవీపీ కాలనీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల్లా చెప్పుకుని ఎంవీపీ కాలనీలోని వివిధ ప్రాంతాల్లో రోడ్డు తవ్వేసి, టెలిఫోన్ కేబుల్, అందులోని కాపర్‌ను చోరీ చేసిన ఎనిమిది మంది నిందితులను ఎంవీపీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ద్వారకా జోన్ నేర విభాగం సీఐ చక్రధర్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న వివిధ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ లైన్ ఫోన్లు పనిచేయడం లేదనే ఫిర్యాదులు రావడంతో బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజినల్ ఇంజనీర్ మురళీ తన సిబ్బందితో ఎంవీపి కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై గోతులు తవ్వి, అందులోని కేబుళ్లను కట్‌చేసినట్లు గమనించారు. తర్వాత కూడా పలు మార్లు ఎంవీపీ డబుల్ రోడ్డు, ఉషోదయ కూడలికి వెళ్లే రోడ్డులో గొతులు తవ్వినట్లు గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 13న కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా ఎనిమిది మంది నిందితులను గుర్తించి, అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి రూ. 2.40 లక్షలు, సుమారు మూడు వందల కిలోల కాపర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ అండ్ బి దరి ఏకలవ్యకాలనీకి చెందిన ఆసనాల పిట్టోడు(55), పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వడ్డెరగూడెంకు చెందిన బత్తుల శ్రీను(40), బత్తుల ఏడుకొండలు, బత్తుల రాజు(20), చేకూరి దుర్గాప్రసాద్(20), దేవళ్ల రాజేష్(20), అమలాపురం నారాయణపేటకు చెందిన బత్తుల ప్రసాద్(26), తెలంగాణ నల్గొండ జిల్లా మిర్యాలగూడెం సుందర్‌నగర్‌కు చెందిన గుంజ గోవర్ధన్ (41)లను అరెస్టు చేశారు. కేసులో చురుగ్గా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసిన సంఘటనలో ఉన్నతాధికారులు ఏ ఎస్ ఐ కిశోర్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, కానిస్టేబుల్ హరిప్రసాద్‌లను అభినందించారు.

సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే దీటైన చట్టాలు అవసరం

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు

వెంకోజీపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతికత విసిరే సవాళ్లకు సమాధానమిచ్చే పటిష్ఠమైన చట్టాలను రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు పేర్కొన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు తీసుకురావాలన్నారు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని, అదే సమయంలో కొన్ని సవాళ్లు సైతం ఎదురవుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో వచ్చిన ఎన్‌డీపీఎస్ చట్టం ప్రాధాన్యతను వివరించారు. గత నాలుగు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 13 వేల కోట్ల రూపాయలు విలువైన మత్తుపదార్థాలను పట్టుకున్నారని చెప్పారు. అలాగే ఇంటర్నెట్ ఆగమనంతో వచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ గురించి వివరించారు. సైబర్ నేరాలు, శిక్షలు ఏ విధంగా విధిస్తారు అనే అంశాలను తెలియజేశారు. న్యాయవాద వృత్తి సోషల్ ఇంజనీరింగ్ అని చెప్పారు. గత దశాబ్ద కాలంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తెర మీదకు వచ్చిందని, దీనిని విరివిగా వినియోగిస్తున్నారన్నారు. దీన్నివల్ల మేధో హక్కులకు భంగం కలిగే అవకాశం దీంతో ఏర్పడుతోందని చెప్పారు. అలాగే కాపీరైట్ చట్టం ఉల్లంఘన జరిగే అవకాశాల సైతం ఏర్పడుతున్నాయన్నారు. యూరోపియన్ దేశాలు ఇప్పటికే హక్కులను రక్షించడానికి కఠినమైన చట్టాలను రూపకల్పన చేయాలని యత్నిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుత ఏఐ సాంకేతికత ఫలితంగా కాపీ రైట్, పేటెంట్ చట్టాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. భారత్‌లో ఈ రంగానికి సంబంధించి ప్రత్యేకమైన చట్టాలు ప్రస్తుతానికి లేవని, వీటి అవసరాలపై మేధోచర్చలు జరగాలని సూచించారు.



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి దుర్గాప్రసాద్‌రావు

ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ యువ న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించే విదంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామం అన్నారు. వివిధ కేసుల్లో వచ్చే తీర్పులపై సాధారణ ప్రజలకు సైతం అవగాహన కల్పించే సులభమైన విధానాలను యువతరం రూపొందించాలన్నారు. దీన్ని ఒక ప్రాజెక్టుగా స్వీకరించి, ఆ దిశగా అడుగు వేయాలని సూచించారు. పనిచేస్తూ నేర్చుకోవడం అనే దానికి ప్రత్యక్ష ఉదాహరణంగా మూట్ కోర్టు నిలుస్తుందన్నారు. ఇటువంటి వాటిని కరికలమ్‌లో భాగం చేయాలని ఆయన సూచించారు.

న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ న్యాయవిద్య విద్యార్థులకు అవసరమైన ప్రత్యక్ష శిక్షణ, నైపుణ్యాలను అందించే విధంగా ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. లోతైన, విస్తృత అవగాహన పొందడానికి ఈ మూట్ కోర్టు పోటీలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తున్నాం

- యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ శాంతియుత నిరసన

సిరిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం శాంతియుత నిరసన చేపట్టారు. ఈ నిరసనకు పలు రాజకీయ పార్టీలు, హిందూ, క్రిస్టియన్, సిక్కు, ఆవాజ్, పలు ప్రజా సంఘాలతో పాటు షైనార్టీ మతాల సంఘాలు మద్దతు తెలియజేశాయి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు భూములు పూర్తిగా ముస్లింలకు చెందిన ప్రైవేటు భూములన్నారు. వందల ఏళ్లగా ముస్లింల ఆధీనంలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములకు రికార్డులు లేవని, వాటిని ప్రభుత్వ భూములుగా పేర్కొని బోర్డు బిల్లులో సవరణలకు చేపట్టిందని విమర్శించారు.సీపీఎం కార్పొరేటర్ డా.గంగారావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఒక్కో బిల్లును ప్రవేశపెడుతున్నారని విమర్శించారు.సిక్కు సంఘం నేత సచ్చేంద్రసింగ్ మాట్లాడుతూ తక్షణం బిల్లును ఉపసంహరించుకోకపోతే దేశంలో లౌకికవాదం పూర్తిగా దెబ్బతింటుందన్నారు.మక్కా మసీద్ అధ్యక్షుడు అబ్దుల్ మున్నీర్ మాట్లాడుతూ కేవలం ముస్లింపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ ప్రెసిడెంట్ అబ్దుల్ మున్నన్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇలియాస్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఆహాద్, స్టేట్ మైనారిటీ యూత్ లీడర్ మహమ్మద్ ఇమ్రాన్, మాజీ కార్పొరేటర్ గొల్లపల్లి ఆనంద్, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు

బీఎన్ నగర్‌లో సీపీఎం ప్రజా పాదయాత్ర


ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

ఆరిలోవ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : బీఎన్ నగర్‌లో కనీస మౌలిక సదుపాయలు లేకపోవడం వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్వీ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరిలోవ తోటగరువునకు సమీపంలో గల గల బీఎస్ఆర్ నగర్‌లో పేద ప్రజలు సుమారు 20 ఏళ్ల నుంచి నివసిస్తున్నారని, అయితే ఇక్కడ ప్రభుత్వాలు మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించలేదని విమర్శించారు. శుక్రవారం ఉదయం బీఎస్ఆర్ నగర్ స్థానిక సంఘ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రధానంగా తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే యూజీడీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, కొండవాలు ప్రాంతంలో కొండ చరియలు విరిగి ఇల్లల పైన పడి పోతున్నది అని ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని, అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నట్టు కుమార్ తెలిపారు. సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజలు అంతా ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చైతన్య యాత్రలో సీపీఎం నాయకలు డి.నాగరాజు, రమణ, సీహెచ్ రాము, పి.నాగమణి, మౌనిక, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధరిత్రి గంటను జయప్రదం చేయండి

- గ్రీన్ క్లైమెట్ ఎన్జీవో సంస్థ పిలుపు

ఎంవీపీ కాలనీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22 రాత్రి ఎనిమిదిన్నర నుంచి తొమ్మిదిన్నర వరకూ ధరిత్రి గంట పేరిట విద్యుత్ ఉపకరణాలను అందరూ ఆపేసి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని గ్రీన్ క్లైమెట్ ఎన్జీవో సంస్థ ఒక ప్రకటనలో కోరింది. 190 దేశాల్లో ధరిత్రి గంటను అమలు చేయనున్నారని, నగర వాసులు కూడా ఇందులో పాల్గొనాలని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం కోరారు. శీతోష్ణస్థితి మార్పు, మానవ కార్యకలాపాలు, ప్రపంచ నీటి ప్రవాహాలకు, వాటిపై ఆధారపడిన అన్ని జీవితాలకు భయంకరమైన ముప్పును కలిగిస్తున్నందున ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించడానికి ఈ ఎర్త్‌అవర్ నిర్వహిస్తున్నారని, అందరూ సహకరించి, నిర్దేశిత సమయంలో స్విచ్‌లను ఆపేయాలని కోరారు.

9,002 మంది ఎస్సీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

- సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు


ఎంవీపీ కాలనీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరంలో విశాఖ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 9002 మంది ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరైనట్టు ఆ శాఖ డిప్యూటీ డైరక్టర్ కె.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ సుమారు 400 మంది విద్యార్థులకు అయిదంచెల తనిఖీలో స్కాలర్‌షిప్పులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేంద్రం వాటా 60 శాతం నిధులతో ఈ స్కాలర్‌షిప్పులు మంజూరైనట్టు వెల్లడించారు. విద్యార్థుల బ్యాంకు అకౌంట్ ఆధార్‌తో పాటు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీఏస్)తో వేలి ముద్రతో లింక్ కావాల్సి ఉండడం వల్ల కొంత ఆలస్యం జరుగుతుందని పేర్కొన్నారు. బ్యాంకు మేనేజర్, విద్యార్థి వేలి ముద్రలు వేయాల్సి ఉంటుందన్నారు. ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఇంజనీరింగ్ విభాగంలో 9,002 మంది విద్యార్థులకు పూర్తి స్థాయిలో ఫీజుల చెల్లింపు పూర్తయిందని, వెరిఫికేషన్ పూర్తయితే పెండింగ్‌లో ఉన్న వారికి కూడా త్వరలోనే చెల్లింపు జరుగుతుందని అన్నారు. అనర్హత జాబితాలోకి వచ్చిన పేర్లు వారి ఆదాయం, కులం ఇతర పత్రాలతో సచివాలాయాల్లో సవరించుకోవాలని తెలిపారు. ఈ ఏడాదిలో విద్యార్థులకు పుస్తకాలు, క్రీడా సామగ్రి, పరీక్షలకు సంబంధించిన సామగ్రి, రెండు తువ్వాళ్లు వంటివి విద్యార్థులకు అందించినట్టు తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ఇతర ఆచార్యులు

వెంకోజీపాలెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఏయూ రాజనీతి ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'భారతదేశం, ఐరోపాల్లో ప్రజాస్వామ్య వైవిధ్యం, మార్పు' అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏప్రిల్ 4న నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సును ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్‌మెంట్ అండ్ అకౌంటబిలిటీ నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సుకు యూరోపియన్ యూనియన్- యురాసేమస్ ఆర్థిక సహకారం అందిస్తోంది. పరిశోధకులకు ఉపయుక్తంగా నిలిచే ఇటువంటి అంతర్జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయమని వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.నరసింహారావు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావు, సదస్సు కన్వీనర్ ప్రేమానందం, విభాగాధ్యపకులు డాక్టర్ సులేమాన్, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఏయూ వీసీ అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి ఎంబీఏ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన యూజీసీ నెట్ ప్రవేశ పరీక్షలో లెక్చరల్ షిప్‌కి అర్హత సాధించారు. ఈ సందర్భంగా వీరిని ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఈ.ఎస్ ధనుంజయరావు, కామర్స్ విభాగాధిపతి జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.

అడవుల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం

ఆరిలోవ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అరణ్యాలు.. గ్లోబల్ ఆహార సరఫరాకే కాకుండా పర్యావరణ సమతుల్యతలో ప్రధాన ప్రాత పోషిస్తాయని ఇందిరాగాంధీ జూపార్కు క్యూరేటర్ జి.మంగమ్మ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవం పురష్కరించుకొని జూపార్కులో 'అడవుల ప్రాముఖ్యత' పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో అడవులు పాత్ర ఒక కీలకమని ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి ఆదిమహాలక్ష్మి ఆశీర్వాద్ యాత్ర


వివరాలు వెల్లడిస్తున్న ఛాందలాల్ అగర్వాల్

మహారాణిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం ఆదిమహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర శనివారం నుంచి చేపడుతున్నట్లు అఖిల భారత అగర్వాల్ సమ్మేళన జాతీయ కార్యదర్శి చాందలాల్ అగర్వాల్ తెలిపారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లోని రాజస్థాన్ సాంస్కృతిక మండలి సమావేశంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. 90 రోజుల పాటు దక్షిణాదిలో యాత్ర నిర్వహిస్తామన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆది మహాలక్ష్మి, అష్టమహాలక్ష్మి ఆలయాన్ని హర్యానాలో నిర్మిస్తామన్నారు. సమావేశంలో సుమాన్ ప్రకాష్ సరావాగీ, వినీత్ లోహియా తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్సుల పరిశీలన


మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న బృందం

సీతంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 25, 26 వార్డుల పరిధిలో గల సీతంపేట, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సులను స్వచ్ఛ సర్వేక్షణ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. అక్కడున్న సౌకర్యాలను పరిశీలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రాంతంలో విద్యుత్ హెచ్‌టీ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయిబాబా ఆలయం, సబ్బం హరి నివాసం రోడ్డు, మైత్రి టవర్, స్వాతి ప్రమోటర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

సీతమ్మధార, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే జరిమానా చెల్లించక తప్పదని ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పష్టం చేశారు. సీతమ్మధార ప్రధాన రహదారి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా వ్యతిరేక దిశలో వస్తున్న వాహనదారులను అడ్డుకుని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వ్యతిరేక దిశలో రావద్దని, హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డుపైకి తోపుడు బండ్లు తీసుకొచ్చినవారిని అడ్డుకుని వెనక్కి పంపారు. ట్రాఫిక్ ఎస్ఐ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కంచరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వవార్డు పరిధి వివేకానంద వీధి, రెడ్డికంచరపాలెంలో అభివృద్ధి పనులను స్థానిక నాయకులు శుక్రవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. సుమారు రూ.8 లక్షలతో సీసీ రోడ్లకు మరమ్మతు, కాలువల నిర్మాణం చేపట్టనున్నారు. వార్డు కార్పొరేటర్ శశికళ, బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈతలపాక సుజాత, పెంటకోట స్రవంతి, పార్వతి, లక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం రేపు

మురళీనగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్ క్లబ్ కళావేదికలో ఈ నెల 23న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ తెలిపారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని అక్షయ ఆసుపత్రి వైద్యుల సాయంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు వి.అచ్యుతరామయ్య, డాక్టర్ సంధ్యారాణి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం


పురాతన ఆలయాన్ని పడగొడుతున్న దృశ్యం

కంచరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి తిక్కవానిపాలెంలో పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గ్రామ సేవాసంఘం చర్యలు చేపట్టింది. ఈ గ్రామంలో 1932లో ఆలయాన్ని నిర్మించారు. తొమ్మిది దశాబ్దాలు దాటడంతో శిథిల స్థితికి చేరింది. నూతన ఆలయాన్ని పునర్నిర్మించాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. పనులను శుక్రవారం ప్రారంభించినట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఉమ్మడి వాసుదేవరావు, పట్టిమ రాజు తెలియజేశారు. స్వామివారి విలువైన వస్తువులు, సామాగ్రిని పక్కనే ఉన్న అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో భద్రపరిచారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలనే భక్తులు, ప్రజలు ఆలయ కమిటీని సంప్రదించి తమవంతు సహాయం అందజేయాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఆస్తిపన్ను చెల్లించనివారి నీటి కనెక్షన్ కట్


ఓ బకాయిదారు ఇంటి నీటి కనెక్షన్‌ను తొలగిస్తున్న అధికారులు

జ్ఞానాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను చెల్లించనివారిపై జీవీఎంసీ జోన్-5 అధికారులు చర్యలు ప్రారంభించారు. మొండి బకాయిదారుల నీటి కనెక్షన్‌ను కట్ చేస్తున్నారు. జోన్ పరిధిలో 1.06 లక్షల అసెస్‌మెంట్ల ద్వారా రూ.72 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.48 కోట్లు మాత్రమే జమ అయ్యింది. జోన్‌లో 52,278 అసెస్‌మెంట్ల నుంచి రూ.18 కోట్లు నీటిపన్ను బకాయిలు వసూలు కావల్సి ఉండగా కేవలం రూ.5 కోట్లు చెల్లించారు. దీంతో శతశాతం వసూళ్లపై అధికారులు కదిలారు. ఇప్పటి వరకు 17,700 మందికి జప్తు నోటీసులు జారీ చేశారు. ఆటోలు, జప్తు వాహనాల ద్వారా పన్ను చెల్లింపులపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించారు. వీరితో పాటు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు, ఆర్ఓ రాజ్యలక్ష్మి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆర్ఐలు కెశ్రీనివాస్, విజయకుమారి, శ్రీనివాస్‌ల సహకారంతో మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి వసూళ్లు చేపడుతున్నారు.

అభివృద్ధికి సహకరించండి

ఆస్తి, నీటిపన్నులను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లించి జీవీఎంసీ అభివృద్ధికి సహకరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము కోరారు. కోట్ల రూపాయిలు బకాయి ఉండడంతో వార్డుల్లో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని అన్నారు. పన్నులు చెల్లిస్తే నిధులు సమకూరి అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బకాయి చెల్లించకపోతే జీవీఎంసీ సేవలు నిలిపివేస్తామని స్పష్టంచేశారు.

ఔషధ విక్రయ కేంద్రాలపై విజిలెన్స్ దాడులు


అల్లిపురంలోని ఓ ఔషధ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రభాకర్ బృందం

అల్లిపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మత్తును కలిగించే ఔషధాల విక్రయంపై శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్ విభాగం పోలీసులు తనిఖీలు చేపట్టారు. అల్లిపురంలోని నీలమ్మ వేపచెట్టు రోడ్డు, వివేకానందవీధి తదితర ప్రాంతాల్లోని పలు ఔషధ దుకాణాలను తనిఖీ చేశారు. విశాఖ ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కింజరాపు ప్రభాకర్ పర్యవేక్షించారు. సైకోటిక్ మెడిసిన్‌ను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఈ-ఇంజక్షన్లు, మత్తు కలిగించే సిరప్‌లు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఔషధ విక్రయదారులను ఆయన హెచ్చరించారు.

పోక్సో చట్టం ఉంది.. జాగ్రత్త


మాట్లాడుతున్న జడ్జి డి.సోని

సీతంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మెలగాలని, మహిళల పట్ల గౌరవభావంతో నడుచుకోవాలని ఆరో అదనపు సీనియర్ సివిల్ జడ్జి డి.సోని పేర్కొన్నారు. ప్రేమ పేరుతో బాలికలను వేధించినా, మోసగించినా పోక్సో చట్టం కింద శిక్ష పడుతుందని, యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ద్వారకానగర్‌లోని ఓ విద్యా సంస్థలో సీఐ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి డి.సోని విద్యార్థులకు చట్టంలోని అంశాలను వివరిస్తూ పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

మహారాణిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల్లో ముగ్గురికి పోలీసు కమిషనరేట్ కార్యాలయం ద్వారా శుక్రవారం రూ.6 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సహాయ కేంద్రం ద్వారా పరిహారం ఇచ్చేవరకు వారికి కావలసిన తోడ్పాటు అందిస్తున్నారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో చనిపోయిన మలిపాటి సూర్యనారాయణ, పైలా సూరిబాబు, కోట్యాడ సూర్యప్రభ కుటుంబాల సభ్యులకు రూ.2 లక్షల వంతున మొత్తం రూ.ఆరు లక్షలను అందజేశారు. ఇంతవరకు 24 మంది బాధితులకు సహాయం అందించారు.

'వైసీపీ తీరు మార్చుకోకపోతే బుద్ధి చెబుతాం'


క్రికెట్ మ్యాచ్ టికెట్‌ను చూపుతున్న కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ పేరు తొలగించారంటూ గుండెలు బాదుకుంటున్న వైసీపీ పెద్ద మనుషులు సాక్షి టీవీ లోగోలో వైఎస్ఆర్ ఫొటో తీసేసినప్పుడు ఎందుకు మాట్లాడలేదు? వైఎస్ఆర్ పేరుతో ఉండే పథకాలకు జగన్ పేరు పెట్టినప్పుడు ఎందుకు హడావిడి చెయ్యలేదని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ప్రశ్నించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మూర్తియాదవ్ మాట్లాడుతూ విశాఖలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు వైఎస్ఆర్ పేరును తొలగించారన్న ఆరోపణకు ఆధారం ఏమిటో వైసీపీ నేతలు చూపించాలన్నారు. ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్ఆర్ విగ్రహం, పేరు ఉన్నా అక్కడే వైసీపీ నేతలు నిరసన వ్యక్తం చేయడం ఇదేమి చోద్యమని నిలదీశారు. ఈ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ త్వరలోనే జరగనుందని, టికెట్లపై కూడా వైఎస్ఆర్ పేరు ఉందంటూ ఆయన చూపించారు. గుడివాడ అమర్నాథ్ కంటి ఆసుపత్రికి వెళ్లి కళ్లు తనిఖీ చేయించుకుని జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. గుడివాడ అమర్నాథ్ చిల్లర వేషాలు మానేసి ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలన్నారు. క్రికెటర్లు వచ్చిన ప్రతిసారీ వైసీపీ నాయకులు ఇలా పరువు తీసే పని చేస్తున్నారన్నారు. వైసీపీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి రాజు కూడా ఎయిర్ పోర్ట్ దగ్గర క్రికెటర్ల బస్సుపై రాళ్ల దాడి చేశారని గుర్తు చేశారు. ఎయిర్ పోర్టు పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైందని, కేవలం ఉనికి చాటుకోవడానికి వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. విశాఖ ప్రతిష్ఠను దెబ్బతీయడం వైసీపీ లక్షణమని ఆరోపించారు. పిచ్చి వేషాలు వేస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని, తగిన బుద్ధి చెబుతుందని మూర్తియాదవ్ హెచ్చరించారు.

బెల్టు షాపులో విక్రయిస్తున్న మద్యం పట్టివేత: ఇద్దరి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

మహారాణిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపు ద్వారా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ పరిధిలోని రెల్లివీధి జాలారిపేట ఏరియాలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు బెల్ట్ షాపుపై దాడి చేశారు. ఇందులో సుమారు రూ.5 వేల విలువైన 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మద్యం అమ్ముతున్న కొత్త జాలారిపేటకు చెందిన చింతపల్లి పరశురాముడు (32), చింతపల్లిఅప్పలకొండ (24)లను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

'గ్రంథాలయాలపై మంత్రి లోకేశ్ ప్రకటన హర్షణీయం'

డాబాగార్డెన్స్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ఆధునీకరించనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమని పలువురు అన్నారు. శుక్రవారం సీఐటీయూ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాల గ్రంథాలయ సిబ్బంది, పెన్షనర్ల సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సిబ్బంది చిరకాలంగా కోరుతున్న 1010 పద్దు కింద జీతాలు, పెన్షన్లు ఇవ్వాలని, స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న సెస్సును నేరుగా జిల్లా గ్రంథాలయ సంస్థల ఖాతాకు జమ చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి గ్రాంటును వెంటనే విడుదల చేయాలని, ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా పి.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సలాది సత్యనారాయణ, వివిధ జిల్లాలకు అధ్యక్ష, కార్యదర్శులు , కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి గ్రంథాలయ ఉద్యోగులు, నాయకులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటం అవసరం



మాట్లాడుతున్న బాలమోహన్‌దాస్, వేదికపై ఇతర ప్రముఖులు

డాబాగార్డెన్స్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పదవీ విరమణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ పిలుపునిచ్చారు. ఇండియన్ బ్యాంకు పదవీ విరమణ ఉద్యోగుల సంఘం రజతోత్సవ మహాసభను శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. అఖిల భారత బ్యాంకు పదవీ విరమణ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్.ఎం.దేశ్‌పాండే, తెలంగాణ విభాగం అధ్యక్షుడు బీవీవీ కొండలరావులు మాట్లాడారు. ఈ సంఘానికి నేరుగా చర్చించే అధికారాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకూ సవరించిన పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆరోగ్య బీమా ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులే భరించాలని మహాసభ డిమాండ్ చేస్తుందని తెలియజేశారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల తదితరులు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం ప్రపంచ అడవుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని ఆవరణలో మొక్కలు నాటారు. అడవులు ప్రాణవాయువును అందిస్తాయన్నారు. కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడం, వరదలను నివారించడం, వాతావరణాన్ని సమతుల్యం చేయడంతోపాటు స్వచ్ఛమైన నీటి వనరులు అందించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అడవుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎల్.లావణ్య, ఎస్.కె.కరిముల్లకు వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.ఎం.ఎ. నివేదిత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అధ్యాపకులు అంజలి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

హిందీ నవ రచయితల శిబిరం ప్రారంభం


శిబిర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఎనిమిది రోజులు నిర్వహించనున్న హిందీ నవరచయితల శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ, కేంద్రీయ హిందీ నిదేశాలయం సౌజన్యంతో హిందీయేతర విద్యార్థినులకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి దక్షిణ భారత రాజభాషా సంస్థాన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కృష్ణబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఆగ్రా నుంచి డా.అర్చన ఝా, రామదాస్ నారాయణ తొండే, డా.పురుషోత్తమ్ పాటిల్ హాజరై హిందీ భాషాభివృద్ధి, వివిధ భాషల మధ్య పరస్పర అనుసంధానాన్ని ప్రోత్సహించడం, కొత్త రచయితలకు ప్రచురణ అవకాశాలతో పాటు మార్గదర్శకత్వం అందించడం, భిన్న సంస్కృతుల మేళవింపుతో హిందీ భాషా వైవిధ్యాన్ని విశదీకరించడం వంటి అంశాలపై కీలక ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.షైజీ, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, డాక్టర్ నళినీ దత్త, డా.ఎస్ దీప్తి, డా.విజయభారతి, డా.కోటేశ్వరరావు, డా.రజీనా పాల్గొన్నారు.

శారదా పీఠం భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

విశాఖ జిల్లా జేసీకి రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆదేశం

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని చినముషిడివాడలో శారదా పీఠం భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. శుక్రవారం అమరావతిలో జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోల శిక్షణ కార్యక్రమం జరిగింది. సమావేశం అనంతరం సిసోడియాను విశాఖ జేసీ కలిశారు. ఈ సందర్భంగా శారదా పీఠం భూ ఆక్రమణల వ్యవహారం చర్చకు వచ్చింది. గురువారం పెందుర్తి తహసీల్దార్ తన సిబ్బందితో కలిసి సర్వే చేశారని జేసీ వివరించారు. గెడ్డ పోరంబోకు, రహదారి, వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లో కొంత మేర ఆక్రమించినట్టు తేలిందని చెప్పారు. దీంతో సిసోడియా మాట్లాడుతూ ఆక్రమణలు పూర్తిగా నిర్ధారించిన తరువాత చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సర్కిల్-1లో బినామీ డీలర్లదే హవా..

కంచరపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి బినామీ డీలర్లు తమ హవా కొనసాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఒకటో సర్కిల్ పరిధిలో వారి పేరుతో రేషన్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారికి వత్తాసు పలుకుతుండడంతో దోపిడీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగిపోతోంది. కంచరపాలెం రైతుబజారు పక్కన గల ఒకటో సర్కిల్ కార్యాలయం వద్ద నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని డిపోలు ఉన్నాయి. వీటి పర్యవేక్షణకు అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారితో పాటు సుమారు ఆరుగురు ఆర్.ఐ.లు పనిచేస్తున్నారు. అయితే సర్కిల్ పరిధిలో ఎక్కడికక్కడే బినామీలు హల్‌చల్ చేస్తున్నా అధికారులు వారిపై చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్లకు తలొగ్గి అధికారులు చర్యలకు వెనకాడుతున్నారని పలువురు కార్డుదారులు ఆరోపిస్తున్నారు. రేషన్ పంపిణీ వాహనదారులతో కుమ్మక్కై సరుకులు దారి మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు ఇంటర్వ్యూలు

ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదని బోర్డు వెల్లడి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంటు డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు శుక్రవారం పబ్లిక్ ఎంటర్‌ప్రైజస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బీ) నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎవరినీ ఎంపిక చేయలేదని తెలిపింది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఉన్న గణేష్ త్వరలో పదవీ విరమణ చేయనున్నందున...ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు శుక్రవారం పీఈఎస్‌బీ వర్చువల్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. స్టీల్‌ప్లాంటు నుంచి ఐదుగురు, హెచ్‌బీఎల్, ఎన్టీపీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా, ఐవోసీఎల్, భెల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున పది మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అయితే ఎవరినీ ఎంపిక చేయలేదని పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పేర్కొంది.

జల గండం

... 5వ పేజీ తరువాయి

వాగు (ప్రస్తుతం ఎంవీపీ కాలనీ మధ్య గుండా వెళుతుంది) వేసవిలో మంచినీటితో ప్రవహించేది. అటువంటి వాగు ఇప్పుడు మురుగు కాల్వగా మారింది. అదేవిధంగా నగరు శివారులో పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకూ గొలుసుకట్టు చెరువులు మాయమయ్యాయి. మధురవాడ, కొమ్మాదిలో గృహ నిర్మాణ సంస్థ కాలనీలు వెలిశాయి. రుషికొండ, పెదగంట్యాడ పరిసరాల్లో చెరువులు కప్పేశారు.

స్మార్ట్ సిటీ పేరుతో రోడ్లుకు ఇరువైపులా కాంక్రీట్...

స్మార్ట్ సిటీ పేరుతో నగరంలో రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేశారు. దీనివల్ల వర్షపునీరు భూమిలో ఇంకే అవకాశం పూర్తిగా మూసుకుపోయింది. చాలా దేశాల్లో రోడ్లకు ఇరువైపులా నీరు ఇంకే కాంక్రీట్‌ను వినియోగిస్తుంటారు. చిన్నచిన్న రంధ్రాలు వుండడంతో నీరు భూమిలోకి ఇంకిపోతుంది. అటువంటి విధానం జీవీఎంసీ పరిధిలో ఎక్కడా కనిపించదు. పార్కుల్లో కూడా సిమెంట్ నిర్మాణాలే పెరిగాయి.

రెయిన్ హార్వెస్ట్ విధానం విఫలం

నగరంలో వర్షపునీరు భూమిలోకి ఇంకే విధానం అమలు పూర్తిగా విఫలమైంది. వ్యక్తిగత గృహం నుంచి అపార్టుమెంట్ వరకూ నిర్మాణ సమయంలో విధిగా ఇంకుడుగుంతలు తవ్వాలి. అయితే పది శాతం మంది కూడా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవడం లేదు. ఇంకుడు గుంతల ఏర్పాటుకు బిల్డర్లు సుముఖత చూపడం లేదు, వ్యక్తిగత ఇల్లు కట్టుకునే వారు కూడా బోరు వేస్తున్నారు తప్ప ఇంకుడు గుంతల ఆలోచన చేయడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు అలంకారప్రాయంగా ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు, మైదానాల్లో కూడా ఇంకుడు గుంతలు నిర్మించడం లేదు. కనీసం వర్షం పడే నీటిని భూమిలోకి పంపే ఏర్పాట్లు కనిపించవు.

ప్రతి ఇంట్లో వర్షపునీటి నిల్వ చేయాలి

నగరం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వినియోగం పెరిగింది. భూమిలో నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నాం. కానీ వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ చేసేస్తున్నారు. 2030కల్లా నీటికి కటకట వచ్చే పరిస్థితి ఉందని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకు తగినంతగా ప్రజలు సన్నద్ధం కావడం లేదు. ఇంటి నిర్మాణ అనుమతుల్లో తప్పనిసరిగా నీటి నిల్వకు ఏర్పాట్లు చేయాలనే నిబంధన అమలుచేయాలి. నేల స్వభావం, నిర్మాణం విధానం మేరకు వర్షపునీటి నిల్వ ట్యాంకులు నిర్మించాలి. నగరంలో కొండలున్నచోట చెక్‌డ్యామ్‌లు, రాక్‌ఫిల్ డ్యామ్‌లు నిర్మించాలి. గ్రామీణ ప్రాంతంలో సాధ్యమైనంతగా ఉపరితలంలో లభించే నీటిని వాడుకోవాలి. చెరువులు, వాగులు, పాడుపడిన బావులను నీటి నిల్వలకు అనుగుణంగా రూపొందించాలి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తీర ప్రాంతాల్లో ప్రజలు 40 మీటర్లకు మించి బోర్లు వేయకూడదు. నీటి ప్రాధాన్యంపై ప్రజలను చైతన్య పరచాలి. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ ప్రాధాన్యం, ఇప్పుడు నగరంలో హెల్మెట్ ధారణపై పోలీసులు అవగాహన కల్పించినట్టు నీటి వినియోగం, నిల్వల సంరక్షణపై చైతన్యం రావాల్సిన అవసరం ఉంది.

- శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ భూగర్భ జల శాఖ, అనకాపల్లి జిల్లా (విశాఖ జిల్లా ఇన్‌చార్జి)

ఉక్కు ఉద్యోగుల మెడపై ఫిట్‌నెస్ కత్తి

... 5వ పేజీ తరువాయి

చేసి, ఆ విభాగంలో మిగిలిన ఉద్యోగులు ఆ పనిని షేర్ చేసుకొని పూర్తి చేస్తుంటారు. ఇలాంటివి అన్ని విభాగాల్లోను సాధారణం. ఇప్పుడు ఇలాంటి వారిని గుర్తించి బయటకు పంపాలని నిర్ణయించారనే ప్రచారం జరుగుతోంది. అదొక్కటే కాకుండా నిజాయితీ, పనితీరును కూడా అంచనా వేసి దానిని కూడా ఫిట్‌నెస్ నివేదికలో పొందుపరిచేలా పాత నిబంధనలకు సవరణలు చేశారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.

యాభై దాటితే ఏటా పరీక్షలు

యాభై ఏళ్లు దాటిన వారికి ఇకపై ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తామని యాజమాన్యం చెబుతోంది. ఇది చట్టంలోనే ఉందని, తాము కొత్తగా పెట్టిన నిబంధన కాదని అధికారులు చెబుతున్నారు. అలాగైతే ఇన్నాళ్లూ ఎందుకు అమలు చేయలేదని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కొన్ని విభాగాల్లో వేయి డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని, అక్కడ పనిచేస్తున్న వారికి కచ్చితంగా అనారోగ్య సమస్యలు వస్తాయని, వారికి న్యాయం చేయాల్సింది పోయి ఫిట్‌నెస్ పేరుతో తొలగిస్తామంటే...కొత్తగా ఎవరైనా పనిచేయడానికి వస్తారా? అని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ కొత్త ఉత్తర్వులు యాభై ఏళ్లు దాటిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇచ్చారని, తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని అధికార, కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

'రేషన్ బియ్యం మాఫియా'పై ఆరా

... 5వ పేజీ తరువాయి

స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. మరోవైపు విజిలెన్స్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. గాజువాక ప్రాంతంలో రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నది ఎవరు?, ఎక్కడకు తరలిస్తున్నారు?, ఎవరెవరు సహకరిస్తున్నారు?...అనే సమాచారం సేకరించే పనిలో ఉన్నారు.

నెల రోజుల్లో పెండింగ్ టీడీఆర్‌ల జారీ

... 5వ పేజీ తరువాయి

వీఎంఆర్‌డీఏ ఖరారు చేసిన మాస్టర్ ప్లాన్‌ను మార్చాల్సిందేనని జిల్లా ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. విశాఖ నుంచి ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తన నియోజకవర్గంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వారి స్వార్థం కోసం మాస్టర్ ప్లాన్‌ని సంగివలస మీదుగా మళ్లించారని ఆరోపించారు. అవసరమైతే సీఆర్‌జెడ్ నిబంధనలు సవరించి అయినా సరే బీచ్ కారిడార్‌ను, మాస్టర్‌ప్లాన్‌ను సరిచేయాలని మంత్రిని కోరారు. ఈ మాస్టర్ ప్లాన్ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌కు మంత్రి నారాయణ సూచించారు. రహదారుల విస్తరణకు అవసరమైన మేరకే ప్రజల నుంచి భూమి తీసుకోవాలన్నారు. భోగాపురం విమానాశ్రయాన్ని అనుసంధానించే రహదారుల అభివృద్ధి పనులు తక్షణమే చేపట్టాలన్నారు. డబుల్ డెక్కర్, మెట్రో కారిడార్ ఆలోచన ఉందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయానికి విశాఖ నుంచి వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలు అనేకం ఉన్నాయని, వాటికి పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యేలు కోరారు. అమరావతిపై వారం వారం సమీక్షిస్తున్నట్టుగానే విశాఖ అభివృద్ధిపై సమీక్షించాలని గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా కోరారు. భూముల అన్యాక్రాంతం విషయాల్లో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మోసపోయిన ప్రజలకు అండగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు పీలా గోవింద్, ప్రణవ్‌గోపాల్ ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'దంత సంరక్షణతోనే మంచి ఆరోగ్యం'

అగనంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : దంత సంరక్షణతో మంచి ఆరోగ్యం లభిస్తోందని, ప్రతి ఒక్కరూ నిత్యం రెండు పూటలా దంతాలను పరిశుభ్రం చేసుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి దంత వైద్య నిపుణుడు డాక్టర్ జాన్సన్ జయశేఖర్ సూచించారు. నోటి ఆరోగ్యం (ఓరల్ హెల్త్‌డే) మాసోత్సవాలు సందర్భంగా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నోరు పరిశుభ్రంగా ఉన్నప్పుడే శరీరంలో అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. దంత సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఫ్యాకల్టీ అడ్వయిజర్‌కు ద్రోణాచార్య అవార్డు


ద్రోణాచార్య అవార్డు అందుకుంటున్న గిరీశ్ భియోగడే.

అగనంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి గోకార్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ కళాశాలకు చెందిన విజ్ఞాన్ రుద్ర ఫ్యాకల్టీ అడ్వైజర్ గిరీశ్ భియోగడే విశేష ప్రతిభ కనబరిచి ద్రోణాచార్య అవార్డు సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో 13 జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, టీమ్ రుద్ర అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. గిరిశ్ భియోగడే నాయకత్వంలో టీమ్ రుద్ర జట్టు అధిక సమయం కష్టపడి, వాహనాన్ని ప్రిపేర్ చేసి ట్రాక్‌పై మెరుగైన పనితీరు కనబరిచింది. వారి నైపుణ్యం, కృషి ఫలితంగా ఈఘనత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గిరీశ్ భియోగడేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెక్టార్ వి. మధుసూదనరావు,అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పూజారికి ఆర్థిక సాయం..

అగనంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస గ్రామానికి చెందిన మరిడిమాంబ అమ్మవారి పూజారి శీరందాసు సన్యాసికి స్థానిక జనసేన నేత విందుల వెంకటరమణ రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. మరిడిమాంబ ఆలయానికి ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తున్న సన్యాసి వయోభారం, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని ఆయన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని ఈ సందర్భంగా వెంకటరమణ పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
● **రాజుగారి దొంగలు :** శ్రీకన్య-2 (గాజువాక)
● **శబ్దం :** సంగం, శారద, సౌజన్య (గోపాలపట్నం),
● **మజాకా :** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామ, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం),తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు(నలుపు) 38, బెండకాయలు 38, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 38, బీరకాయలు 42, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 13, క్యారెట్ 22 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 24, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 52, దోస కాయలు 24,వెల్లుల్లి(పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, కీరదోస 20, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట)3, చుక్కకూర(కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గు మ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం64, బొప్పాయి42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	420
విజయనగరం	424
శ్రీకాకుళం	424

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	85
లైవ్ ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190


ఆధునీకీకరణకు నోచుకోక అధ్వానంగా ఉన్న శ్మశానంలోని పరిసరాలు


వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

అధ్వానంగా 71వ వార్డు శ్మశానవాటిక

» ఆక్రమణల తొలగింపు, ఆధునికీకరణకు చర్యలు తీసుకోండి
» అధికారులకు డీపీ రాష్ట్ర పరిశీలకుడు, ఏపీ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజారావు వినతి

శ్రీనగర్,మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్‌లో ఉన్న 71 వార్డు స్మశాన వాటికలో ఆక్రమణలను తొలగించాలని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు, ఏపీ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు జీవీఎంసీ అధికారులు, ఏపీఐఐసీ, జెలా కమిషనర్ అయినవిల్లి కిషోర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ తాను మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఈ శ్మశాన స్థలానికి ఏపీఐఐసీ నిధులు రూ.10 లక్షలతో కాంపౌండు వాల్‌ను నిర్మించామని, మున్సిపల్ నిధులతో రెండు బోరువెల్స్, ఒక వెయిటింగ్ హాల్‌ను నిర్మించి, కాలుష్య నివారణకు విస్తారంగా మొక్కలను నాటామన్నారు. సుమారు ఎకరాన్నర స్థలం ఉన్న స్మశాన వాటికలో ప్రజావసరాల నిమిత్తం రెండు బోరువెల్స్, రెండు బర్నింగ్ షెడ్లు, రహదారి , తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని పలుమార్లు జీవీఎంసీ అధికారులకు వినతి పత్రాలు అందజేసినా పనులు తూతూ మంత్రంగా, నామమాత్రంగా చేసి విడిచి పెట్టేశారన్నారు. 71వ వార్డు ఆటోనగర్ కార్మికులు, శ్రీనగర్, శ్రీరామ్ నగర్, ఉప్పర కాలనీ, గుడివాడ గురునాథరావు కాలనీ, రెల్లి కాలనీ, మన్నా ట్యాంకు, పెట్రోలు బంక్, రైల్వే క్వార్టర్సు వరకూ జీవీఎంసీ నిధులతో సీసీ డ్రైన్లు, రోడ్లను విస్తరించాలన్నారు. పలు అపార్ట్‌మెంట్లు నుంచి వస్తున్న మురుగునీరు పోయేందుకు సరైన డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగు నీరు గుంతలలో చేరి మురికి కుంటలుగా తయారై పందులు, దోమలకు నివాస కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. శ్వాశన వాటికల అభివృద్ధిని, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత అధికారుల స్పందించి శ్మశాన వాటికలో ఎంత భాగం కబ్జాకు గురైందనే విషయాన్ని పబ్లిక్ సర్వే చేయించి, కబ్జాలు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా ప్రయోజనాలు కోసం శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందేలా చర్యలు


మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న సూర్యనారాయణ తదితరులు

కూర్మన్నపాలెం,మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 13న కూర్మన్నపాలెం ఆర్టీసీ డిపో వద్ద జరిగినరోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నక్కా కృష్ణ, ద్రోణాద్రి రాంబాబు కుటుంబాలకు ఆర్థిక సహకారం అందేలా కార్పొరేటర్లు బొండా జగన్, ముత్యాలు నాయుడు, 86 వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ చర్యలు తీసుకున్నారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో వీరు లారీ యజమానితో చర్చించి, మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు చొప్పున పరిహారం ఇచ్చేలా మాట్లాడారు. ఆ నగదును ఆయా కుటుంబాల పెద్దల సమక్షంలో శుక్రవారం నల్లూరు సూర్యనారాయణ చేతులు మీదుగా మృతుల భార్యలకు అందజేశారు. పల్లా శ్రీనివాసరావుకు, కార్పోరేటర్లుకు, నల్లూరు సూర్యనారాయణలకు మృతుల కుటుంబాల పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అటవీ దినోత్సవం

గాజువాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. పెదగంట్యాడ చేపలపాలెం ఎంపీపీ స్కూలులో అటవీ దినోత్సవాన్ని విద్యార్థులు వినూత్నంగా నిర్వహించారు. ఎండు పుల్లలు, ఆకులు, పూలరేకులతో ప్రత్యేకంగా రూపొందించిన చెట్టుతో పాటు మానవ జీవనంలో పచ్చని చెట్ల ఆవశ్యకతను తెలియజేసే స్లోగన్లతో ప్ల-కార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం వినోద్‌కుమార్ చెట్ల పెంపకం ఆవశ్యకతను వివరించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, డ్వాక్రా మహిళలతో పాఠశాల ఆవరణలో చెట్లను నాటారు.

గాజువాక పీహెచ్‌సీలో...

ప్రపంచ అటవీ దినోత్సవం గాజువాక పీహెచ్‌సీలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు సుధాకరరావు, బద్రిలు అటవీ దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగ అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చెట్ల పెంపకం ఆవశ్యకత వివరిస్తూ ప్ల-కార్డులు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కేవీలో ప్రవేశాల ప్రక్రియ చేపట్టకుంటే ప్లాంటు అడ్మిన్ భవనం ముట్టడిస్తాం

78వ వార్డు కార్పొరేటర్ గంగారాం హెచ్చరిక

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటి, 11వ తరగతిలో అడ్మిషన్ల ప్రక్రియ తక్షణమే ప్రారంభించాలని, లేనిపక్షంలో ఉక్కు పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం హెచ్చరించారు. కేవీలో అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్కూల్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసేలా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కుట్ర చేస్తుందన్నారు. పాఠశాల యథావిధిగానే నడిచే విధంగా ఉక్కు యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కేవీ ముందు ఆందోళన చేస్తున్న గంగారాం, విద్యార్థుల తల్లిదండ్రులు

ఎస్సీల్లో అన్ని వర్గాల వారికి న్యాయం : పెద్దాడ సోమునాయుడు

పెదగంట్యాడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ ఆమోదం తెలపడం ద్వారా ఎస్సీ విభాగంలోని అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు పెద్దాడ సోమునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుమారు 25 సంవత్సరాలుగా పోరాటాలు, ఆందోళనలు జరుగుతున్నాయని, ఇప్పుడు ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టి వర్గీకరణకు ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

76వ వార్డులో హైమాస్ట్ లైట్లు ప్రారంభం

పెదగంట్యాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలోని వివిధ జంక్షన్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు పార్కు, వివిధ ప్రాంతాల్లోని రోడ్ల కూడళ్లలోను వీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు బొడ్డు సత్యారావు, అప్పలరాజు, మంగ, పిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి


మల్లు స్వరాజ్యంకు నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ పేదలు, రైతాంగ సమస్యలపై జీవితాంతం పోరాడిన ఘనత ప్రముఖ కమ్యునిస్ట్ నాయకురాలు మల్లు స్వరాజ్యంకే దక్కుతుందని ఐద్వా నగర ప్రదాన కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. షీలానగర్‌లో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన మల్లు స్వరాజ్యం 3వ వర్ధంతి కార్యక్రమంలో ఆమె స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులే అర్పించారు. కార్యక్రమంలో జి.మణి, వై.మానస, సునీత, దేముడమ్మ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి బ్రెయిన్‌డెడ్.. నలుగురికి అవయవదానం

ఔదార్యం చాటుకున్న కుటుంబసభ్యులు


అవయవదానం సర్టిపికెట్ అందుకుంటున్న సీతమ్మ కుటుంబసభ్యులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తాను మరణించి నా తమ తల్లి అవయవాలు దానం చేయడంతో నలుగురికి కొత్త జీవితం ఇచ్చేలా చేశారు ఓ వృద్ధురాలి కుటుంబసభ్యులు. బెల్-హెచ్‌పీవీపీలో సెక్యూరిటీ అధికారి జీఎస్ఎన్ రెడ్డి తల్లి జి.సీతమ్మ (65) అనారోగ్యానికి గురవడంతో ఆమెను గత ఆదివారం చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించారు. సీతమ్మ గురువారం బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కిమ్స్ వైద్యులు జీవన్‌దాన్ ద్వారా సీతమ్మ కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కలిగించడంతో వారు అవయవదానానికి సమ్మతించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సీతమ్మ కళ్లు, కిడ్నీలు, లివర్, గుండె సేకరించిన వైద్యులు వాటిని నలుగురికి అమర్చేందుకు నిర్ణయించారు. తల్లి మరణించిన దుంఖ సమయంలోనూ నలుగురికి కొత్త జీవితం ప్రసాదించేందుకు అంగీకరించిన సీతమ్మ కుటుంబసభ్యులను ఆస్పత్రి సిబ్బందితో పాటు బెల్-హెచ్‌పీవీపీ సిబ్బంది అభినందించారు.

ల్యాండ్ పూలింగ్ అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?


ముదపాక భూముల్లో అధికారులు, రైతులు వేర్వేరుగా పెట్టిన హెచ్చరిక బోర్డులు (ఫైల్)

పెందుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదపాకలో ల్యాండ్ పూలింగ్ వివాదంపై నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల జిల్లా యంత్రాంగం డిప్యూటీ కలెక్టర్ హోదా గల ముగ్గురు అధికారులను నియమించింది. ఈ నేపథ్యంలో అక్కడ అక్రమాలు బహిర్గతం కానున్నాయా? అన్నది స్థానికంగా చర్చనీయాంశమైంది. ముదపాకలో వైసీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాల కోసం రెవెన్యూ శాఖ చేపట్టిన భూ సమీకరణ అంశం ఆది నుంచి వివాదాస్పదమైంది. ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని, బినామీలతో భూదందా చేశారంటూ కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయి. జగనన్న కాలనీ పేరిట భూ మాయ జరిగిందన్నది ప్రధాన ఆరోపణ.

ఇదీ వివాదం

ముదపాకలో జగనన్న కాలనీ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు పరిహారం కింద పట్టాలు, ల్యాండ్ పొజిషన్ ఆక్యుపెన్సీ (ఎల్‌పీవోసీ)లు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. భూములిచ్చేందుకు అంగీకరించని రైతులు కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో ఉత్తర్వు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో కాలనీలో గృహనిర్మాణాలు చేపడుతుండటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కోర్టు వివాదంలో ఉన్న ఈ భూముల్లో పనులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ కొందరు రైతులు వివిధ రూపాల్లో తమ నిరసన తెలిపారు. మరోవైపు రెవెన్యూ సిబ్బంది విధులకు విఘాతం కలిగిస్తున్నారంటూ తొమ్మిది మంది రైతులపై అప్పటి తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. దీంతో ఆ రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తమ భూములపై కోర్టు స్టేటస్ కో ఇచ్చిందని పేర్కొంటూ సుమారు 50 ఎకరాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఇవే భూములను ల్యాండ్‌పూలింగ్‌లో సేకరించామంటూ రైతులు పెట్టిన బోర్డులు తొలగించిన రెవెన్యూ సిబ్బంది కలెక్టర్ ఆదేశాలంటూ హెచ్చరిక బోర్డు పెట్టారు. రైతులు మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అడ్వకేట్ కమిషనర్‌ను నియమించి విచారణ చేపట్టినా భూ వివాదం సమసిపోలేదు.

విజిలెన్స్ తనిఖీలు: ముదపాకలోని ల్యాండ్ పూలింగ్‌లో మొత్తంగా 862 ఎకరాలు (ఇందులో కొండ, వాగు, గెడ్డ ప్రభుత్వ భూములు కలిపి) సేకరించగా, సుమారు 200 మంది రైతుల నుంచి 400 ఎకరాలు సేకరించిన డి పట్టా పట్టాదారులకు ఎకరానికి 900 గజాలు, ఆక్రమణదారుకు 450 గజాల చొప్పున ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. భూములిచ్చిన రైతులకు భూ సమీకరణ యాజమాన్య హక్కు పత్రాలు (ఎల్‌వోపీసీ) జారీ చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఇక్కడే వివాదానికి బీజం పడింది. కొందరు రైతులకు ఎల్‌పీవోసీలు ఇవ్వగా, ఇంకొందరికి ఇవ్వలేదు. జియోట్యాగ్ చేసి రైతులను వారి భూముల వద్ద నిలబెట్టి ఫొటోలు తీశారు. కొంతకాలానికి వీఎంఆర్డీఏ సమీకరణ పనులు మొదలు పెట్టింది. ముదపాకలో రైతులకు పరిహారంగా ఇచ్చే భూములను చూపకపోవడంతో కొందరు భూములు ఇచ్చేది లేదని, 90 ఎకరాలకు చెందిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఎల్‌పీవోసీలు దక్కని మరి కొందరు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఇలా సుమారు 95 మంది రైతులు న్యాయం కోసం పోరాటం చేస్తున్నారు. రైతుల పేరిట ఉన్న పత్రాలు వారికి ఇవ్వకుండా పెందుర్తి రెవెన్యూ అధికారులు అప్పటి వైసీపీ పెద్దల సూచనతో నాటకానికి తెర తీశారని ఆరోపణలు ఉన్నాయి. తమకు వత్తాసు పలికే రైతులకు గతంలో ఇదే తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసి తహసీల్దార్‌గా వచ్చిన ఒకరు రాత్రిపూట ఎల్‌పీవోసీలు ఇచ్చి మరుసటి రోజు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడిన వైసీపీ బినామీదార్లకు పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేశారని రైతుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ వాస్తవ యజమానులు ఎవరన్నది బహిరంగ రహస్యం. వివాదాస్పద భూముల్లో జగనన్న కాలనీ ఏర్పాటులో అవకతవకలు చోటు చేసుకున్నాయని, అసలు హక్కుదారుల పేర్లు జాబితా నుంచి మాయమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం ముదపాక భూ సమీకరణపై పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు చేపట్టి దస్త్రాలు పరిశీలించారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ల్యాండ్ పూలింగ్ అక్రమాలు, వివాదంపైనే 158 అర్జీలు అందాయి. ఇప్పుడు తాజాగా ముదపాక భూ సమీకరణపై నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు డిప్యూటీ కలెక్టర్ హోదా గల ముగ్గురు అధికారులను నియమించడంతో ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఈ వివాదానికి ఇప్పటికైనా ముగింపు లభిస్తుందా? అన్నది చర్చనీయాంశమయ్యింది.


ముదపాకలోని ల్యాండ్ పూలింగ్ భూములు

నేత్ర వైద్యశాలకు అంబులెన్స్ వితరణ


అంబులెన్స్ తాళాన్ని అందజేస్తున్న గెయిల్ సీజీఎం ఎల్.ఎస్.రావు తదితరులు

వేపగుంట మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి రూ.27 లక్షల విలువైన అంబులెన్స్‌ను గెయిల్ సీజీఎం ఎల్.ఎస్.రావు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎల్.ఎస్.రావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో అత్యాధునిక కంటివైద్యం అందజేస్తున్న ఈ ఆసుపత్రికి సీఎస్ఆర్ నిధుల్లో భాగంగా అంబులెన్స్‌ను అందజేశామన్నారు. భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం ఉంటుందన్నారు. జీఎం ఎం.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ నిరుపేదలకు వైద్యం అందించేందుకు ఈ అంబులెన్స్ ఉపయోగపడుతుందన్నారు. శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జి.ఎం. కె.రాధాకృష్ణ, డీజీఎం వి.రమేష్‌కుమార్, కె.బంగార్రాజు, గెయిల్ డీజీఎం స్టిఫెన్ పట్నా, మదన్ కులాడే పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పార్కులో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, అధికారులు

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధికారులతో కలిసి పరిశీలించారు. మర్రిపాలెం ఉడా లేఅవుట్, ఆర్.అండ్.బి జంక్షన్ దరి లలితా డిలైట్ గ్రీన్ బెల్ట్, వనితా వాకింగ్ పార్క్, పాస్‌పోర్టు దరి ఉన్న పార్క్‌లో జరుగుతున్న లైటింగ్, సుందరీకరణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కరాస ప్రాంతంలో 3 ఫేస్ ఎలక్ట్రికల్ లైన్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన శాఖ ఏఈ పల్లవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, సంతోష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అలంకరణ కొబ్బరికాయల పంపిణీ నేడు

వేపగుంట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేపగుంట పరిసర ప్రాంతాల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా భక్తుల సహకారంతో చేపట్టిన రంగుల కొబ్బరికాయల అలంకరణను శనివారం తొలగించనున్నట్లు అర్చకుడు శేషాద్రి శర్మ తెలిపారు. భక్తులకు ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య కొబ్బరికాయలు వాపసు చేస్తామని పేర్కొన్నారు.

పలు అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం


సమావేశంలో పాల్గొన్న మేయర్ హరి వెంకట కుమారి, సభ్యులు

వెంకోజీపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 104 అంశాలు పొందుపరిచారని, వాటిని సంఘం సభ్యులు చర్చించిన పిదప ఒక అంశం వాయిదా వేయగా, 2 అంశాలు సభ్యులు తిరస్కరించారని, మిగిలి 101 అంశాలు ఆమోదం పొందాయన్నారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనుల అంశాలకు సంబంధించి ఉన్నాయన్నారు. వాటిని చర్చించిన పిదప సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. ఈ సమావేశంలో కార్యదర్శి టీవీ రమణ, వ్యయ పరిశీలకులు సి.వాసుదేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

పెందుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపారన్న అభియోగంపై నమోదైన కేసుల్లో ఏడుగురికి రూ.70 వేల జరిమానా విధించారని ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు శుక్రవారం తెలిపారు. మద్యం తాగిన వాహన చోదకులను రెండో స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించిందన్నారు.

జెర్రిపోతులపాలెంలో ఇరువర్గాల ఘర్షణ


ఘర్షణ పడుతున్న వైసీపీ, కూటమి నాయకులు

పెందుర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జెర్రిపోతులపాలెంలో ఆక్రమణల పరిశీలనకు వెళ్లిన టీడీపీ, జనసేన నాయకులను వైసీపీ నేత అడ్డుకోవటంతో వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి కొట్లాటకు దారితీయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన నేతలు గల్లా శ్రీనివాసరావు, గంతకోరు శివకుమార్, టీడీపీ నేత, సర్పంచ్ మడక అప్పలరాజు తదితరులు జెర్రిపోతులపాలెం లిక్కర్ డిపో సమీపంలోని పెదగాడి రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 420లో నాలుగున్నర ఎకరాల భూమిని పరిశీలించి, రెవెన్యూ రికార్డులో చెరువు ప్రాంతంగా నమోదై ఉందని నిర్ధారించుకున్నారు. ఈ భూమి వైసీపీ నేత చెరలో ఉన్నట్లు తెలుసుకుని మీడియాకు తెలిపే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో మాజీ సర్పంచ్, వైసీపీ నేత కోన శ్రీనివాసరావు తన అనుచరులతో అక్కడికి చేరుకున్నారు. తన స్థలంలోకి ఎందుకు ప్రవేశించారు, ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ టీడీపీ, జనసేన నేతలను హెచ్చరించారు. ఇది చెరువు భూమి అని వారు అనడంతో వైసీపీ నేతలు ఘర్షణకు దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. వైసీపీ నేతలు అరాచకం చేస్తున్నారని భావించిన కూటమి నేతలు సంఘటనస్థలి నుంచి బయటకు వచ్చేశారు. జనసేన నేత గల్లా శ్రీనివాసరావు పోలీసులకు ఫోన్ చేయడంతో వైసీపీ నేతలు అక్కడి నుంచి జారుకున్నారని కూటమి నేతలు తెలిపారు. గల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ నేత కోన శ్రీనివాసరావు తప్పుడు పత్రాలతో చెరువు భూమిని ఆక్రమించుకున్నారని, పరిశీలనకు వెళ్లిన తమపై దాడికి యత్నించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

భీమిలిలో శిథిల చరిత్ర

పురాతన కట్టడాలను పట్టించుకోని పర్యాటక శాఖ

- ఆనవాళ్లను కోల్పోతున్న నాటి గురుతులు
- దక్షిణ భారతంలోనే మొదటి మునిసిపాలిటీ
- అప్పట్లో వెలుగొందిన పోర్టు
- చారిత్రక ఆనవాళ్లు డచ్ సమాధులు
- భావితరాలకు అందకుండా పోతున్న చరిత

(భీమునిపట్నం, ఆంధ్రజ్యోతి)

పురాతన పట్టణం... ఎన్నెన్నో అద్భుత ఘట్టాలకు ఆలవాలం. చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి చెందిన నగరం... సువిశాల తీరం, డచ్ వారి నుంచి బ్రిటిష్ కాలం వరకు వెలుగొందిన పోర్టు, నేటికీ ప్రాభవాన్ని చాటుతున్న ఎర్రమట్టి దిబ్బలు ఇలా.. ఒకటేమిటి భీమునిపట్నం గొప్పతనాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు... అంతటి ప్రసిద్ధి నొంది, పర్యాటకులకు ఆలవాలంగా వెలుగొందాల్సిన చారిత్రక పట్టణంలో నాటి గురుతులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ఇబ్బడి ముబ్బడిగా ఆదాయాన్ని తెచ్చిపెట్టాల్సిన పర్యాటకశాఖ పట్టించుకోకపోవడం, కనీస రక్షణ చర్యలు, పర్యవేక్షణ లేకపోవడంతో వందల ఏళ్ల నాటి చారిత్రక కట్టడాలు శిథిలమైపోయి, ఆనవాళ్లు కోల్పోతున్నాయి.

భీమునిపట్నం చరిత్ర 17వ శతాబ్దంలో డచ్ ఓడరేవు నుంచి ప్రారంభమవుతుంది. వివిధ దేశాలతో సంబంధ బాంధవ్యాలు నెరిపిన పురాతన పోర్టు షిప్పింగ్ కార్యాలయం,తీరంలో ఇంటర్నేషనల్ సిగ్నలింగ్ స్టేషన్, పోర్టు కన్సర్వేటర్ క్వార్టర్లు... ఇలా ఒకటా రెండా ఎన్నో ఎన్నెన్నో. నాటి చరితకు సజీవ సాక్షాలుగా మరిన్ని తరాలకు అందాల్సిన ఈ చారిత్రక సంపదపాలకుల నిర్లక్ష్యానికి శిథిలమైపోతోంది. వందల ఏళ్ల నాటి భవనాలు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ భవనాల పరిస్థితి ఏమాత్రం తెలియకపోయినా, పట్టించుకోకున్నా కాకినాడ పోర్టులో భీమిలి పోర్టు షిప్పింగ్ ఆఫీసు పోర్టు కన్సర్వేటర్ పనిచేస్తుంటారు. ఇదీ ఈ పట్నం దుస్థితి. చారిత్రక వివరాల్లోకి వెళితే..

400 ఏళ్ల ప్రాభవం

సుమారు నాలుగువందల ఏళ్లక్రితం భీమిలిలో అడుగుపెట్టిన డచ్ వారు ఇక్కడ పోర్టును నిర్మించి వాణిజ్యం ప్రారంభించారు. 1628లో అబ్దుల్లా కుతుబ్‌షా నుంచి అనుమతి పొంది, తీరంలో సముద్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. 1641లో కోట, ఫ్యాక్టరీ నిర్మించారు. 1675లో భీమిలిని పరిపాలించిన డచ్ గవర్నర్ ఇక్కడి పోర్టును కోరమాండల్ ఎక్స్‌పోర్టు ట్రేడింగ్ రీజియన్‌గా అభివృద్ధి చేశారు. అప్పట్లో ఇక్కడి నుంచి సెయిల్ క్లాత్, గన్నీ బ్యాగ్స్ లను బర్మా, పెనిన్స్‌యూలకు ఎగుమతి చేసేవారు. లాంగ్ క్లాత్‌ను, నీగ్రోస్ క్లాత్‌ను సౌత్ ఈస్ట్ ఏషియా, ఆఫ్రికాకు ఎగుమతి చేసేవారు. గోనార్త్ గోదావరి నుంచి గోపాల్‌పూర్ వరకూ ఇక్కడి నుంచే బియ్యం విదేశాలకు ఎగుమతయ్యేవి. ఈ వ్యాపారంలో అప్పట్లో సిలోన్ (శ్రీలంక)లో కొందరు మధ్యవర్తుల నిర్ణయించిన ధరలనుకనుగుణంగా ఎగుమతి చేయడం విశేషం. పులికాట్ సరస్సు ప్రాంతాన్ని అప్పట్లో రైస్ బౌల్‌గా పిలిచేవారు. అక్కడి నుంచి ఇక్కడి పోర్టుకు బియ్యం వచ్చేవి. ఈ విధంగా భీమిలిలో పోర్టు ట్రేడింగ్ కంపెనీలు యూరప్ పొలిటికల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో 1781లో బ్రిటిష్ వారు, డచ్ వారి మధ్య యుద్ధం జరిగింది. ఇందులో విజయం సాధించిన ఈస్ట్ ఇండియా కంపెనీ భీమిలిని తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆ తరువాత శాంతిస్థాపనలో భాగంగా మళ్లీ డచ్‌వారికి అప్పగించారు. మరోమారు 1824లో ఈ ఇద్దరి మధ్య యుద్ధం జరగడంతో పోర్టును బ్రిటిష్ వారికి అప్పగించేశారు. దీంతో 1825 నుంచి పోర్టు వారి ఆధీనంలోకి వచ్చింది. అనంతర కాలంలో బ్రిటిష్ వారు పోర్టును అభివృద్ధి చేశారు. కోల్‌కత్తా, మద్రాస్ మధ్యలో భీమిలిని ప్రధాన కమర్షియల్ పోర్టుగా తీర్చిదిద్దారు.



శిథిలమైన పోర్టు, షిప్పింగ్ కార్యాలయం భవనం



భీమిలి తీరంలో ఉన్న లైట్ హౌస్

వేట టన్నుల బెల్లం ఎగుమతి

చిట్టివలసలో అర్బుత్‌నాథ్ అండ్ కంపెనీ 1867లో బెల్లం పరిశ్రమను స్థాపించింది. అప్పట్లో ఏడాదికి ఆరువేల టన్నుల బెల్లంను విదేశాలకు ఎగుమతి చేసేవారు. పట్నంలో స్థిరపడిన డచ్, ఫ్రెంచ్, ఇంగ్లండ్ వారు ఆయిల్ సీడ్స్ ఎగుమతులు చేస్తుండేవారు. ఏటా భీమిలిలో పోర్టులో వాణిజ్యం వృద్ధి చెందుతుండడంతో అర్బుత్‌నాథ్ కంపెనీ బెల్లం పరిశ్రమకు అనుబంధంగా జ్యూట్ ఫ్యాక్టరీని ప్రారంభించి గన్నీబ్యాగ్స్, సిమ్మెంట్ బ్యాగ్స్ ఎగుమతి చేసేది. యూరోపియన్ జార్జి రిప్లె భీమిలిలో షిప్పింగ్ కంపెనీని, గ్రీకు కంపెనీ ర్యాలీ ఎక్స్‌పోర్టు కంపెనీని, ఆసియాటిక్ స్టీమ్ నేవిగేషన్ కంపెనీ, లూయిస్ డ్రైటెస్ కంపెనీ, స్థానికులు ఆయిల్ సీడ్ క్రషింగ్ కంపెనీలు స్థాపించారు. ఆయా కంపెనీల కోరికపై భీమిలిలో మద్రాస్ ఇంపీరియల్ బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేసింది. ఇక్కడి నుంచి యునైటెడ్ కింగ్‌డమ్, వెస్ట్ జర్మనీ తదితర ప్రాంతాలకు ఎగుమతి, దిగుమతులు జరిగేవి. 1906లో భీమునిపట్నం-కళింగపట్నం జ్యూట్ బెయిలింగ్ కంపెనీ ఏర్పాటైంది. భీమిలి పోర్టు 1930 వరకూ బ్రిటిష్ వారి ఆధీనంలో ప్రముఖ పోర్టుగా పరిఢవిల్లింది.

చారిత్రక చిహ్నం లైట్‌హౌస్

పోర్టు వ్యాపారం వెలుగొందుతుండడంతో బ్రిటిష్ వారు 1868లో 36 అడుగుల ఎత్తున తీరంలో నేవిగేషన్ ఎయిడ్ (లైట్ హౌస్)ను కళింగపట్నం-కాకినాడ తీరంలో మొట్టమొదటిగా నావికులకు స్టీమర్లు, షిప్‌లకు సదుపాయంగా రూ.10 వేలతో నిర్మాణం చేపట్టారు. ఇది కేవలం మూడు నెలల వ్యవధిలోనే సేవలను ప్రారంభించింది. ఈ లైట్‌హౌస్‌ను తిరిగి 1903లో అభివృద్ధి చేశారు. భీమిలి తీరంలో 1820లో ఇంటర్నేషనల్ సిగ్నలింగ్ స్టేషన్‌ను నిర్మించారు. అలాగే, 1872లో భీమిలి ఉప్పుటేరు (అప్పటి జెట్టీ) ఒడ్డున భీమునిపట్నం షిప్పింగ్ ఆఫీసును నిర్మించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో శత్రు దేశాల దాడుల నుంచి రక్షణలో భాగంగా ఓపెన్ యాంకరింగ్ పోర్టుగా వున్న భీమునిపట్నం పోర్టును భారత ప్రభుత్వం మూసివేసింది. విశాఖ డాల్ఫిన్ నోస్ వద్ద సహజసిద్ధ పోర్టు నిర్మించడంతో క్రమేణా ఇక్కడి నుంచి వ్యాపారాలు నగరానికి మారాయి. విదేశీ కంపెనీలు ఎత్తివేసారు. తర్వాత చాలా కాలం భీమిలి పోర్టు కార్యాలయం నావిగేషన్‌కు సదుపాయంగా కాకినాడ పోర్టు ఆధీనంలో నడిచేది. 2010 వరకూ నడిచిన ఈ కార్యాలయం తర్వాత భవనం శిథిలమవడం, హుద్‌హుద్‌లో పూర్తిగా పోర్టు ఆఫీసు, సిగ్నలింగ్ ఆఫీసు, కన్సర్వేటర్ క్వార్టర్ దెబ్బతినడంతో ఎత్తివేశారు. దీంతో ఈ భవనాలు మత్స్యకారుల వలలు భద్రపరుచుకునే ప్రదేశంగా మారింది. లైట్‌హౌస్‌ను కేంద్ర లైట్‌హౌసెస్ అండ్ షిప్స్ శాఖకు అప్పగించడంతో వారు నిర్వహిస్తున్నారు. చారిత్రక ఆనవాళ్లుగా ఉన్న ఈ భవనాలను పునర్నిర్మించి, భీమిలి చరిత్రను సజీవ సాక్ష్యంగా భావితరాలకు అందించాలని స్థానికులు కోరుతున్నారు.





తుప్పలతో నిండి ఉన్న అంతర్జాతీయ సిగ్నలింగ్ స్టేషన్

విశాఖ చేరుకున్న 'లఖ్‌నవూ సూపర్ జెయింట్స్'

స్థానిక ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 24న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు శుక్రవారం నగరానికి చేరుకుంది. రాత్రి 7.30 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు అక్కడ నుంచి ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. శని, ఆదివారాల్లో నెట్ ప్రాక్టీస్ చేసి సోమవారం రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనున్నారు.

- విశాఖపట్నం-స్పోర్ట్సు/గోపాలపట్నం



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు క్రీడాకారులు

ఐపీఎల్ మ్యాచ్‌కు శరవేగంగా ఏర్పాట్లు

మధురవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగే ఐపీఎల్ టీ-20 మ్యాచ్‌కు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మ్యాచ్ కోసం స్టేడియాన్ని నూతన హంగు లతో తీర్చిదిద్దడానికి సుమారు మూడు నెలలుగా రూ.40 కోట్లతో అంచనా వ్యయంతో పనులను ప్రారంభించారు. ఇప్పటికే స్టేడియం నలుమూలలా ఉన్న ఫ్లడ్ లైట్లు స్థానంలో రూ.9.5 కోట్లతో ఎల్ఈడీ లైట్లు అమర్చారు. మెయిన్ గేట్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధాన హాలులో ఐపీఎల్ లుక్ వచ్చేలా బ్యాటింగ్, బౌలింగ్ కటౌట్లు ఏర్పాటు చేశారు. స్టేడియం వెలుపల జాతీయ రహదారికి సమాంతరంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రేక్షకులకు ఇబ్బం దులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



సుందరంగా స్టేడియం మెయిన్ గేట్



స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఉపాధి పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేస్తాం

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కలెక్టర్ హామీ

మహారాణిపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న పనులు, ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లాలో పథకం అమలు తీరును ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటించి ప్రజలకు అండగా నిలవాలని ఉపముఖ్యమంత్రి సూచించారు. అర్హులందరికీ అత్యధిక పనిదినాలు కల్పించి, ఆర్థిక భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో, ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయితీరాజ్ ఎస్ఈలు, డీపీవో, డ్వామా పీడీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఇతర జిల్లా అధికారులు

క్రైం... crime news

బంగారం చోరీ చేసిన నిందితుడి అరెస్టు

తగరపువలస, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బైపాస్ రోడ్డు పక్కనున్న ఫంక్షన్ హాలులో ఈనెల 14న జరిగిన బంగారు హారం చోరీ కేసులో పోలీసులు నిందితుడ్ని శుక్రవారం అరెస్టు చేశారు. క్రైమ్ ఎస్ఐ పి. సూర్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం.. 14న ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమానికి కృష్ణా జిల్లా నందిగామకు చెందిన పి. రమేష్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అక్కడ అతని భార్య మెడలో ఉన్న రెండు తులాల బంగారు హారం అపహరణకు గురైంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సిసి ఫుటేజ్ ఆధారంగా ఫంక్షన్‌కు వచ్చిన వారి కదలికలను పరిశీలించారు. ఈమేరకు సాలూరుకు చెందిన రెడ్డి శంకరరావు అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతన్ని అరెస్టు చేసి, గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి వింత ప్రవర్తన!

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

అక్కయ్యపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు లక్ష్మీనారాయణపురం రోడ్డులోని ఆర్కే గౌరీ శంకర రెసిడెన్సీలోని నాల్గో అంతస్తు తన ఫ్లాట్ (4ఇ) లో సంతోష్ (46) అనే వ్యక్తి మంట వేసి చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేశాడు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వెళ్లి ఆయనను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సంతోష్ ఆర్మీలో ఉద్యోగం చేసి రిటైరయ్యాడని, ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని అపార్టుమెంట్ వాసులు తెలిపారు. 15 ఏళ్ల క్రితం నుంచి సంతోష్ తన భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలతో అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. కొన్ని నెలల క్రితం రోజూ భార్యను చిత్రహింసలకు గురి చేసి గ్యాస్ సిలిండర్లు విప్పి కాల్చేస్తానని బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసి, పుట్టింటికి కాకినాడ వెళ్లిపోయిందని చెప్పారు. అంతేకాకుండా సంతోష్ రోజూ అర్ధరాత్రి సమయంలో వచ్చి వాచ్‌మన్‌ను కొట్టి గాయపరిచేవాడని పేర్కొన్నారు. ఇలా చాలాసార్లు అందరినీ భయభ్రాంతులకు గురిచేయడంతో తాము బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని అపార్టుమెంట్ వాసులు అంటున్నారు. శుక్రవారం సాయంత్రం కూడా ఆయన ఫ్లాట్ గేటుకు మేకను కట్టి, దారికి అడ్డంగా కోళ్ల పెట్టడంతో తాము నడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంటి లోపల తాళం వేసి రెండు గ్యాస్ సిలండర్లు పెట్టి ఏవో వస్తువులకు మంట పెట్టి ఇంట్లోనే కూర్చున్నాడు. బయటకు రమ్మని పోలీసులు ఎంత చెప్పినా రాకుండా ఉండిపోయాడు. తర్వాత పోలీసులు సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు.



లోపల మంట పెట్టి కూర్చున్న సంతోష్

పెద్ద రుషికొండ బీచ్‌లో పురాతన విగ్రహం లభ్యం

సాగర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పెద్ద రుషికొండ బీచ్‌లో పురాతనమైన మహా విష్ణువు విగ్రహం శుక్రవారం లభ్యమైంది. కొంతమంది పర్యాటకులు బీచ్‌లో విహరిస్తుండగా ఇసుకలో విగ్రహం కనిపించింది. వెంటనే నగరంలో వున్న పురావస్తు శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు పెద్ద రుషికొండ బీచ్‌కు చేరుకుని విగ్రహాన్ని పురావస్తు శాఖ మ్యూజియానికి తరలించారు. ఇది 14వ శతాబ్దానికి చెందిన మహా విష్ణువు విగ్రహంగా అధికారులు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తరువాత వివరాలు వెల్లడిస్తామని వారు తెలిపారు.



నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు వినతి

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని కోరుతూ కేంద్ర క్రీడలు, యువజన శాఖా మంత్రి సుఖ్ మాండవీయాకు ఎంపీ శ్రీభరత్ వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకం ద్వారా ఆరిలోవలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్, నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అలాగే చినగదిలి వద్ద అత్యాధునిక మల్టీపర్పస్ ఇండోర్ హాల్ నిర్మాణానికి కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. రూ. 14 కోట్ల అంచనా వ్యయంతో బ్యాడ్మింటన్, వాలీబాల్, జూడో, రెజ్లింగ్, హ్యాండ్‌బాల్, కబడ్డీ వంటి క్రీడల కోసం ఈ ప్రాజెక్టును రూపొందించారని వివరించారు. నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విశాఖలో ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



కేంద్రమంత్రి సుఖ్ మాండవీయాకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ శ్రీభరత్

సరకు లోడింగ్‌లో తూర్పు కోస్తా రైల్వే రికార్డు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సరకు లోడింగ్‌లో తూర్పు కోస్తా రైల్వే జోన్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఇప్పటివరకు ఏ రైల్వేజోన్ కూడా ఆర్థిక సంవత్సరంలో 250 మిలియన్ టన్నులు సాధించలేదని, ఆ మార్కును ఆర్థిక సంవత్సరం (2024-25) ఇంకా పది రోజులు ఉండగానే...తూర్పు కోస్తా సాధించిందని పేర్కొన్నారు. గతంలో కూడా ఈ జోనే 250 మిలియన్ టన్నులు లోడింగ్ చేసిందని, వరుసగా ఇది రెండో ఏడాది అని వివరించింది. ఇదే ఆర్థిక సంవత్సరంలో 228.3 మిలియన్ టన్నుల సరకును అన్ లోడింగ్ చేసినట్టు తెలిపింది. ఇది గత ఏడాది కంటే 2.6 శాతం అధికమని వెల్లడించింది. మహానది బొగ్గు గనులు, ఐదు కీలకమైన పోర్టులు (విశాఖపట్నం, గంగవరం, పారాదీప్, ధామ్రా, గోపాల్‌పూర్), చత్తీస్‌గఢ్‌లో ఐరన్‌ఓర్ గనులు, స్టీల్, అల్యూమినియం పరిశ్రమలు ఉండడం వల్ల ఈ రికార్డులు సాధించామని వివరించింది.

కేజీబీవీల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం కేజీబీవీల్లో సీట్ల భర్తీ (2025-26 విద్యా సంవత్సరం)కి అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతిలో 120 సీట్లు, 7వ తరగతిలో 2, 11వ తరగతిలో 120 సీట్లు, 12వ తరగతిలో 23 సీట్లు భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్స్, పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందవచ్చునని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ ఖజురియా

సింహాచలం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా. ఆర్‌పీ ఖజురియా సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అయనకు ఏఈఓ ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఎఫ్‌డీసీ చైర్మన్ గోత్రనామాలతో అర్చకులు అంతరాలయంలో పూజలు చేయగా, గోదాదేవి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.



ఖజురియాకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏఈఓ ఆనందకుమార్